సోమవారం
28-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 216
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'పహల్గాం'పై భారత్‌కు సంపూర్ణ మద్దతిస్తాం: ఎఫ్‌బీఐ

వాషింగ్టన్: జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి జరిగి 26 మంది ప్రాణాలు కోల్పోవడంపై ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్యాష్ పటేల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాద భూతం నుంచి ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ఇదే క్రమంలో భారత్‌కు సంపూర్ణ మద్దతిస్తామని ఆయన ఆదివారం ప్రకటించారు. ఈ దాడిని భద్రతా దళాలు ప్రతిఘటించడాన్ని మెచ్చుకున్నారు. ఉగ్రదాడి బాధితులకు ఎఫ్‌బీఐ తర్వాత సానుభూతి ప్రకటించారు. భారత ప్రభుత్వానికి తమ తరపున పూర్తిగా సహకరిస్తామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్‌కు అండగా నిలుస్తామని అమెరికా ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గాబార్డ్ కూడా ప్రకటించారు. పహల్గాం దాడి దోషులను వేటాడాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం తమ వైపు నుంచి పూర్తిగా సహకారం ఉంటుందన్నారు.

సరిహద్దులు ఉద్రిక్తం



త్రివిధ దళాలు సంసిద్ధం

- కశ్మీర్‌ను జల్లెడపడుతున్న భద్రతాబలగాలు
- ఎన్ఐఏకి ఉగ్రదాడి దర్యాప్తు
- నిఘాసంస్థల వద్ద కీలక సమాచారం
- భారత్‌కోసం 130 అణుబాంబులు సిద్ధమంటూ పాక్ ప్రేలాపన
- భారీ మూల్యం చెల్లించక తప్పదని మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనడంతో పాటు రెండు దేశాల మధ్య పరిస్థితి మరింత దిగజారుతోంది. రెండు వైపులనుంచి కాల్పులతో సరిహద్దులు దద్దరిల్లుతున్నాయి. ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత త్రివిధ దళాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులు జరుపుతుండగా... భారత దళాలు తిప్పి కొడుతున్నాయి. జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని మోహరించారు. అవసరమైతే భూతల, వైమానిక దాడులతో పాటు నౌకదళం కూడా రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది. ఇందులో భారత నౌకాదళం ఆదివారం అరేబియా సముద్రంలో క్షిపణి పరీక్షలు నిర్వహించింది. అయితే పాక్ వైపునుంచి రెచ్చగొట్టే ప్రకటనలు వెలువడుతునే ఉన్నాయి. భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటుండడంతో పాక్ ఆందోళనకు గురవుతున్నప్పటికీ ఆ దేశ నాయకులు మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. తాజాగా పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసి అణుదాడి చేస్తామంటూ భారత్‌కు హెచ్చరికలు చేశారు. పాకిస్థాన్ వద్ద భారత్ కోసం 130 అణ్వాయుధాలను సిద్ధం చేసి ఉంచామన్నారు. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దుచేసి నీటి సరఫరాను నిలిపివేస్తే...యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరించారు. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్ సైతం మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. రెండు దేశాల సిద్ధాంతాన్ని ప్రస్తావించిన ఆయన.. అన్ని అంశాల్లో హిందూ, ముస్లింలు

- మిగతా 2 లో

ఆగని పాక్ కాల్పులు

పాక్ సైన్యం వరుసగా మూడురోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడింది. నియంత్రణ రేఖ వెంబడి వివిధ ప్రాంతాల్లో ఆదివారం పాక్ కాల్పులు జరిపింది. దీన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టారు. తుత్మారి గలి, రాంపూర్ సెక్టార్లలో కాల్పులు జరిగాయి. ఈ క్రమంలో భారత సైన్యాధికారులు పారామిలిటరీ సైన్యానికి ఇచ్చిన సెలవులను సైతం రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని మోహరించారు. మరోవైపు జమ్ముకశ్మీర్ పరిధిలో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 14 మంది స్థానిక ఉగ్రవాదుల వివరాలను నిఘా వర్గాలు విడుదల చేశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) లోని ముజఫరాబాద్ సమీపంలో జీలం నదిలో నీటి మట్టం ఒక్కసారిగా కొన్ని అడుగులు పెరిగిపోవడంతో పాక్ ఉలిక్కిపడింది. స్థానిక అధికారులు హట్టియాన్ బాలా అనే ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అంతర్జాతీయ నీటి నిర్వహణ నిబంధనలకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. ఇది ముజఫరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రజలను నదీ తీరంలోకి వెళ్లొద్దని మసీదుల నుంచి హెచ్చరించారు. ఈ నది అనంతనాగ్ జిల్లా మీదుగా ప్రవహించి చకోథి ప్రాంతంలో పీవోకేలోకి చేరుతుంది. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన ప్రకటించిన నేపథ్యంలో భారత్ హఠాత్తుగా దిగువకు నీరు విడుదల చేసిందని పాక్ వర్గాలు ఆరోపించాయి.

మావోయిస్టుల భారీ సొరంగం

- 1000 మంది తలదాచుకునే అవకాశం
- కర్రెగుట్టలో పోలీసు బలగాల గాలింపు ముమ్మరం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ భద్రతా దళాల గాలింపు కొనసాగుతోంది. మావోయిస్టు అగ్రనేతలు పాపారావు, హిడ్మా, దామోదర్ కర్రెగుట్టలో ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు మొదటి నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఇక్కడి అడవుల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టాయి. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి చుట్టుముట్టాయి. ఈ సమయంలో భద్రతా బలగాలు భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా దీని నిర్మాణం ఉంది. దీని లోపల పెద్ద మైదానం ఉంది. ఇందులో నీటి వసతి, ఇతర సౌకర్యాలున్నట్లు సమాచారం. కొన్ని నెలల పాటు మావోయిస్టులు ఈ సొరంగంలోనే ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. గాలింపు చర్యల కారణంగా మావోయిస్టులు ఈ సొరంగం నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. కొండల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని చెబుతున్నారు. మావోయిస్టులు దాక్కున్న అన్ని కొండలను చుట్టుముట్టే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని ప్రభుత్వం, భద్రతా బలగాలు భావిస్తున్నాయి. తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దు కేంద్రంగా ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గాంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు... మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శనివారం భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందినట్లుగా విస్తృత ప్రచారం సాగినప్పటికీ అధికారులు నిర్ధారించలేదు. మరోవైపు సొరంగం లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ జవాను మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి గాయపడ్డారు. ఆయనను హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు.

కాల్పులు వెంటనే నిలిపివేయాలి

మరోవైపు ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌పై కమ్యూనిస్టులు, పౌరహక్కుల నేతలు, విద్యావేత్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాల్పులు వెంటనే

- మిగతా 2 లో

నౌకా విధ్వంసక క్షిపణుల పరీక్ష

ముంబై: పహల్గాం ఘటన నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఇండియన్ నేవీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. ఈ విషయాన్ని సామాజిక మధ్యమం ద్వారా ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో సన్నద్ధతను పరీక్షించుకునేందుకు వీటిని ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా- ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ సిద్ధమని ప్రకటించింది. ఇటీవల భారత్

- మిగతా 2 లో

జీజీహెచ్‌లకు కొత్త సూపరింటెండెంట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలలకు సూపరింటెండెంట్లు, వైద్య కళాశాలల్లో ప్రిన్సిపాల్స్ నియామకానికి చర్యలు చేపట్టారు. ఒంగోలు జీజీహెచ్‌కు కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యం, శ్రీకాకుళంకు డాక్టర్ అమూల్య, తిరుపతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ నియమితులయ్యారు. విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏవీ రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. మచిలీపట్నం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా

- మిగతా 2 లో

మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి కారణంగా తమ దేశానికి తిరిగి వెళ్లాలని పాకిస్థాన్ పౌరులకు భారత ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. దీంతో కొత్త 'ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025' ప్రకారం గడువు తీరిపోయినా భారత్‌లోనే ఉండటం, వీసా నిబంధనలు ఉల్లంఘించడం, నిషేధిత ప్రాంతాలను సందర్శించడం వంటివి జరిగితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. బిజినెస్, విజిటర్, స్టూడెంట్

- మిగతా 2 లో

సీఎస్‌గా రామకృష్ణారావు

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ కె. రామకృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో కొత్త సీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రామకృష్ణారావు ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం రామకృష్ణారావుతోపాటు ఆరుగురు సీఎస్ రేసులో నిలిచారు. సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. పస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా రామకృష్ణారావును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మరోవైపు, భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జాబితాలో...

- గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్ - శశాంక్ గోయల్
- ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో- జయేశ్ రంజన్
- పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి- సంజయ్ కుమార్
- ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ - స్మితా సబర్వాల్
- కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ - దానకిశోర్
- పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి (హెచ్‌ఎండీఏ వెలుపల)- టీకే శ్రీదేవి
- పట్టణాభివృద్ధి కార్యదర్శి (హెచ్‌ఎండీఏ పరిధి) - ఇలంబర్తి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ - ఆర్వీ కర్ణన్
- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ - కె.శశాంక
- జెన్‌కో సీఎండీ - ఎస్.హరీశ్
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో - నిఖిల
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ - సంగీతం సత్యనారాయణ
- దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో - ఎస్. వెంకటరావు
- సెర్ప్ అదనపు సీఈవో - పి. కాత్యాయనీదేవి
- ఇండస్ట్రీ, ఇన్వెస్టిమెంట్ సెల్ అదనపు సీఈవో - ఈవీ నర్సింహారెడ్డి
- జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ - హేమంత్‌సహదేవ్ రావు
- టీజీఎంఎస్‌ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ - ఫణీంద్రారెడ్డి
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ - కధిరవన్
- హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) - విద్యాసాగర్
- హెచ్‌ఎండీఏ సెక్రటరీ - ఉపేందర్‌రెడ్డి.

అగ్నిప్రమాద బాధితులకు
రూ.లక్ష తక్షణ సాయం

కూనంనేని డిమాండ్

విశాలాంధ్ర- హైదరాబాద్: అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తక్షణ సహాయం కింద రూ.లక్ష ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ రెవెన్యూ పరిధిలోని కుంట్లూరు వద్ద రావినారాయణ రెడ్డి కాలనీలో ఆదివారం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఈ ఘోర అగ్నిప్రమాదంలో 300 గుడిసెలు కాలిపోయాయని, గ్యాస్ సిలెండర్లు పేలడం వలన ప్రమాద తీవ్ర ఎక్కువైందన్నారు. గుడిసెవాసులంతా కష్టజీవులన్నారు. ఇళ్లల్లో పనిచేసేవారు, ఆటోలు నడిపేవారు ఉన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నీడన రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల నుంచి ఇక్కడకువచ్చి గుడిసెలు వేసుకున్నారని, అవి కాలి పోవడంతో వీధిన పడ్డారని అన్నారు. కలెక్టర్ తక్షణ సాయం కింద రూ.ఆరున్నర వేలు ఇస్తామన్నారని, ప్రభుత్వంతో మాట్లాడి మరికొంత ఇప్పిస్తామని చెప్పారన్నారు. ఇవి ఏమాత్రం సరిపోదని, ఆపదలో వున్న వారిని ఆదుకోవాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపైన ఉన్నదని కూనంనేని పేర్కొన్నారు. పార్టీ ప్రతినిధి బృందాన్ని

- మిగతా 2 లో

ఏపీ డీఎస్సీలో కీలక మార్పులు

- డిగ్రీలో 35 శాతం ఉన్న వారు అర్హులే
- సమయం చాలదంటూ అభ్యర్థుల ఆవేదన
- మరో టెట్ పెట్టాలని తాజా బీఈడీల మొర

2లో

నక్సలిజాన్ని సామాజిక కోణంలోనే చూస్తాం: రేవంత్

2లో

ఆర్టీసీకి పూర్వవైభవం

ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం: మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఓ దశలో ఆర్టీసీని మూసేస్తారోమో అనే దశకు తీసుకువచ్చారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నియామకాలు చేపట్టలేదు... బస్సులు కొనుగోలు చేయకుండా ఆర్టీసీ నిర్వీర్యం చేశారని అరోపించారు. లక్డికపూల్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో ఆర్టీసీ విశ్రాంత అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నూతన నియామకాలు చేపట్టడంతో పాటు కొత్త బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీ పూర్వ వైభవం తీసుకువస్తున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ఆర్టీసీ పరిరక్షణ, ప్రయాణికుల సౌకర్యం దృష్టిలో పెట్టుకొని పని చేస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ప్రారంభంతో ఆర్టీసీ ప్రగతిలోకి వచ్చిందన్నారు. తాము అధికారం చేపట్టే నాటికి 2023లో సీసీఎస్‌లో రూ. 682 కోట్ల బకాయిలు ఉన్నాయని, దానిని రూ.450 కోట్లకు తగ్గించామని త్వరలో జీరో చేస్తామని వివరించారు. పీఎఫ్ బకాయిలు రూ.1373 కోట్లు ఉంటే ... రూ.580 కోట్లకు తగ్గించామని చెప్పారు. ప్రతి నెల ఆర్టీసీకి రూ.300 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. తొలుత ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎం.సత్యనారాయణకు నివాళులర్పించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.

ఇదీ లోకం!

ఏం? ఎన్ని సార్లు చెప్పాలి? చూస్తే అర్థంకావట్లా? ఎంతగా కలిసిమెలిసి ఉన్నామో!

తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్సే

- రాష్ట్రంలో 2014కు ముందున్న పరిస్థితి
- హామీలు గాలికొదిలేశారు
- నేను బయటికి వస్తా...అందరి తరపున పోరాడుతా
- బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ గర్జన

విశాలాంధ్ర-వరంగల్: ఇప్పటి నుంచి నేను బయటికి వస్తా... అందరి తరపున పోరాడుతానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఆనాడు, ఈనాడు, ఏనాడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూనని, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే నిరంకుశంగా అణిచివేసింది కాంగ్రెస్సేనని మండిపడ్డారు. వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు

- మిగతా 2 లో



ఇరాన్ పోర్టులో పేలుడు

28కు పెరిగిన మృతులు: 800 మందికి గాయాలు

టెహ్రాన్: ఇరాన్‌లోని హోర్మజ్గాన్ ప్రావిన్స్‌లోని పోర్టులో సంభవించిన పేలుడులో చనిపోయిన వారి సంఖ్య 28కు పెరిగింది. అలాగే గాయపడిన వారి సంఖ్య 800కు చేరుకుంది. ఈ మేరకు ఇరాన్ వార్తాసంస్థలు ఆదివారం నివేదించాయి. పేలుడుకుగల కారణాలు ఇప్పటివరకు తెలియ లేదని తెలిపింది. ప్రావిన్స్ రాజధాని బందర్ అబ్బాస్‌లోని షహీద్ రాజాయి పోర్టులో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటన క్రమంలో పోర్టులోని కార్యకలాపాలన్నీ స్తంభించినట్లు తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. మంటలను దాదాపుగా ఆర్పివేశామని, అక్కడక్కడ మళ్లీ మంటలు వస్తున్నప్పటికీ ఆందోళన పడేంత పరిస్థితి లేదని టెహ్రాన్ అగ్నిమాపక దళాధికారి జలాల్ మలేకి చెప్పినట్లు ఫార్స్ వార్త సంస్థ నివేదించింది. ఈ ఘటనపై ఎక్స్ మాధ్యమంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు సానుభూతి తెలిపారు. ముమ్మర దర్యాప్తునకు ఆదేశించారు. ఘటనాస్థలాన్ని సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి ఇస్కందర్ మెమనీకి సూచించినట్లు తెలిపారు. ఇదిలావుంటే, ఈ ఘటన నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇరాన్‌కు సంఘీభావాన్ని ప్రకటించాయి.

60 రోజులుగా పస్తులే...

- పలస్తీనా ప్రజల దీన స్థితి
- గాజాకు ఆహార సరఫరా నిలిపేసిన ఇజ్రాయిల్

జెరూసలేం: గాజాలో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పలస్తీనీయన్లు 60 రోజులుగా పస్తులు ఉంటున్నారు. గాజా స్ట్రిప్‌లోకి ఆహారం, ఇంధనం, మందులు తదితర నిత్యావసారాలు సరఫరా కాకుండా ఇజ్రాయిల్ నిషేధం విధించింది. దీంతో సరుకు లేక సహాయ సంఘాలు సైతం చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. స్వచ్ఛంధ సంస్థలు కూడా బాధితులకు భోజనం పెట్టలేని స్థితికి చేరుకున్నాయి. స్థానిక మార్కెట్లు దాదాపుగా ఖాళీ అయ్యాయి. తమ పిల్లల పొట్ట నింపలేని దీన స్థితికి పలస్తీనా కుటుంబాలు చేరుకున్నాయి. ఒక పూట కూడా ఆహారం తినలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ఇజ్రాయిల్ దురాక్రమణతో తమ జీవితాలు నాశనమయ్యాయని, క్యాన్డ్ ఫుడ్ (డబ్బాల్లో నిల్వవుంచే ఆహారం)ను మునుపెన్నడూ తినలేదని, ఇప్పుడు అదే ఆధారమని ఓ మహిళ అన్నారు. నిల్వవుంచిన కూరగాయాలు, అన్నం, పాస్తా తిని 23 లక్షల మంది పలస్తీనియన్లు కాలం వెళ్లదీస్తున్నారు. పాలు, పండ్లు, మాంసం కనుమరుగు కాగా రొట్టె, గుడ్లు కొరవడ్డాయి.

మార్కెట్లలో కొద్దిపాటి ఉన్న తాజా కూరగాయాల ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. వాటిని కొనలేని పరిస్థితుల్లో గాజా ప్రజలు పౌష్టికాహారానికి పూర్తిగా దూరమయ్యారు. పిల్లలకు పోషకాలు అందక వారి ఎదుగుదల దెబ్బతింటున్నట్లు వైద్యులు హెచ్చరించారు. ఇటీవల ఖాన్ యూనిస్ సంతలో దుకాణాలన్నీ దాదాపుగా ఖాళీగా కనిపించాయి. కొద్దిపాటి టమాటోలు, వంకాయలు, ఉల్లిపాయలు ఉండగా, ఒక వ్యాపారి వద్ద క్యాన్డ్ బీన్స్ ఉన్నాయి. మరొకరి వద్ద పాస్తా బ్యాగులున్నాయి. టమాటోలు కిలో ధర 50 షెకల్స్ అంటే 14 డాలర్లు ఉంది. ఇజ్రాయిల్ దాడులకు ముందు కిలో టమాటోల ధర డాలరు కంటే తక్కువ ఉండేది. ఇప్పుడు టమాటోలు తినడం కలగా మారిందని స్థానికులు అన్నారు. గాజాలో పంటలు పండే పరిస్థితి లేదు.వ్యవసాయ భూములను ఇజ్రాయిల్ దళాలు నాశనం చేశాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రెండు వారాలు లేక నెల రోజుల్లో నిల్వలన్నీ ఖాళీ అవుతాయి. ఆపై ఆకలి చావలు తప్పవు. ఇజ్రాయిల్ తీరును ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి ఆక్షేపిస్తున్నా నెతన్యాహూ సర్కారు ఏ మాత్రం కనికరం లేకుండా పలస్తీనియన్లను పస్తులుంచి చంపేస్తోంది. కాగా, 2023, అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ వైమానిక, భూతల భీకర దాడులతో ఇప్పటిరకు 51 వేల మంది పలస్తీనీయన్లను చనిపోయారు. మృతుల్లో పిల్లలు, మహిళలే ఎక్కువ. దాదాపు లక్షన్నర మంది గాయపడ్డారు. స్వరం కోల్పోయిన పలస్తీనియన్లు గుడారాల్లో బతుకుతున్నారు.

పనామా, సూయజ్ మార్గాల్లో మా నౌకలు ఉచితంగా తిరగాలి: ట్రంప్

వాషింగ్టన్: పనామా కెనాల్, సూయజ్ కెనాల్‌లో తమ వాణిజ్య, సైనిక నౌకలు ఉచితంగా ప్రయాణించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నారు. ఇందుకోసం చర్యలు తీసుకోవాలని మంత్రి మార్కో రూబియోకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. ఇదే విషయాన్ని ఆయన తన సామాజిక మాధ్యమం 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. వాస్తవానికి ఉత్తర, దక్షిణ అమెరికా మధ్య ఇస్తమస్ అనే సన్నని భూభాగం గుండా పనామా కెనాల్ ప్రవహిస్తుంది. ఈ కెనాల్ ద్వారా అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాల మధ్య రాకపోకలను నౌకలు వేగంగా సాగించవచ్చు. ఈ మార్గంలో అమెరికా కంటెయినర్ ట్రాఫిక్‌ను ఏటా 40శాతంగా ఉంది. 20వ శతాబ్దంలో కెనాల్ నిర్మాణాన్ని అమెరికా పూర్తి చేసింది కానీ వ్యూహాత్మకంగా కీలకమైన జల మార్గాల నియంత్రణను పనామాకు 1999లో కట్టబెట్టింది. అయితే ఈ కెనాల్‌ను తిరిగి తమ అధీనంలోకి తీసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన చాలా సార్లు ప్రస్తావించారు. కెనాల్‌పై తిరిగి నియంత్రణ పొందేందుకు ఆర్థిక లేక సైనికశక్తి వినియోగించడానికైనా సిద్ధమని జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు ట్రంప్ అన్నారు.

గోబ్యాక్... పాకిస్థానీలు

జిల్లాల్లో నిఘా వర్గాల జల్లెడ... 21 మంది గుర్తింపు

మదనపల్లెలో ఒకే కుటుంబంలో ఐదుగురు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గాం ఉగ్ర దాడి ఘటన తర్వాత రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. నిఘా వర్గాలు జిల్లాల్లో జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని పాకిస్థానీ జాతీయులు వారి సొంత దేశానికి తిరుగుముఖం పట్టేందుకు సిద్ధమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా పాకిస్థాన్ జాతీయులు తక్షణమే రాష్ట్రం విడిచి వెళ్లి పోవాల్సిందిగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించిన విషయం విదితమే. రెండు రోజుల పాటు జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో ఆయన సమీక్షించి... ఎక్కడ పాకిస్తానీ యులు ఉన్నా వెంటనే వారిని పంపేయాలని ఆదేశించారు. దీనిపై పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగి మొత్తం 21 మంది పాకిస్థానీయులను గుర్తించి... వారి దేశానికి వెళ్లిపోవాలని సూచించారు. వారిలో 14 మంది ఆదివారం లోపు వెళ్లిపోతామని చెప్పగా, మరో ఏడుగురు వైద్య సేవల కోసం వచ్చామని ఈనెల 29న ఆస్పత్రిలో చూపించుకుని... అదే రోజు వెళ్లిపోతామని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. మొత్తం 21 మందికి గాను ఒక్క అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనే ఐదుగురు పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించారు. ఇండియన్ ఎంబసీ సమాచారంతో ఈ ఐదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారిగా నిర్ధారించారు. గులాబ్ జాన్ అనే మహిళ సౌదీలో పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఆరుగురు పిల్లలకు ఆమె జన్మనిచ్చింది. గులాబ్ జాన్‌కు ఒక బిడ్డ మాత్రం భారతదేశంలోనే పుట్టగా... మిగిలిన ఐదుగురు సౌదీలో జన్మించారు. రెసిడెన్స్ వీసాపై మదనపల్లెలో 20 ఏళ్లుగా ఉంటూ అక్కడే స్థిరపడింది. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం దేశం వదిలి వెళ్లాలని గులాబ్ జాన్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె దేశాన్ని వదిలి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి ఒక్కరిపై నిఘా పెట్టి అందరినీ ఈ నెల 29 లోపు దేశం దాటి పోయేలా చూడాలని ఎస్పీలకు డీజీపీ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. వారి ప్రయాణానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లను కూడా ముమ్మరం చేశారు. రాష్ట్రం అంతటా ఉన్న పాకిస్థానీ పౌరులపై ప్రత్యేక నిఘా పెంచి, ఎలాంటి అనూహ్య ఘటనలు జరగకుండా చూస్తున్నారు. కొత్తగా రాష్ట్రానికి ఎవరు వస్తున్నా, వారి వీసా వివరాలను పరిశీలించి... అనుమతులు జారీ చేసే విధానాన్ని కఠినతరం చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజలకు భద్రతా పరిస్థితిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. విదేశీ పౌరులపై ముఖ్యంగా పాక్ పౌరులపై ప్రభుత్వ నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. అటు కేంద్ర ప్రభుత్వం అత్యవసర భద్రతా సలహా పేరుతో సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం జరుగుతోందని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల పేరుతో సోషల్ మీడియా వేదికగా వదంతులు వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటితో పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను హై అలెర్ట్ జోన్లుగా ప్రకటించారన్న తప్పుడు ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. హైఅలర్ట్ జోన్ల నుంచి భారత ప్రభుత్వం లేదా, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి తప్పుడు ప్రకటన చేయలేదని తేల్చిచెప్పారు. ఇలాంటి వదంతులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మావోయిస్టుల భారీ సారంగం

(మొదటిపేజీ తరువాయి)

నిలిపివేయాలని, ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు పదే పదే ప్రతిపాదిస్తున్నా... కర్రెగుట్టల్లో కూంబింగ్ నిర్వహించడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తక్షణమే కూంబింగ్ నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కర్రెగుట్టల్లో పారామిలటరీ దళాలు జరుపుతున్న కాల్పులను వెంటనే నిలిపివేయాలని, మధ్య భారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత, ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక ఆదివాసీలే బలవుతున్నారని అన్నారు.

ఏపీ డీఎస్సీలో కీలక మార్పులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ నిరుద్యోగుల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు ప్రభుత్వం డీఎస్సీ దరఖాస్తు ప్రక్రియలో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన మార్పులను ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో పాఠశాల విద్యాశాఖ పొందుపరిచింది. ప్రధానంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు టెన్త్, ఇంటర్ మార్కుల పర్సంటేజీ విధానంలో మార్పు చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీలో జనరల్ అభ్యర్థులకు 50శాతం, రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు తప్పనిసరి చేశారు. ఎస్జీటీ పోస్టులకు ఇంటర్‌లో జనరల్ అభ్యర్థులకు 50, రిజర్వుడు వారికి 45 శాతంగా పరిగణించారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌ను ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తి చేసిన వారికి స్కూల్ అసిస్టెంట్ మ్యాథమేటిక్స్‌కు అర్హత కల్పించారు. వెబ్‌సైట్‌లో కంప్యూటర్ సైన్స్ ఆప్షన్ లేకపోవడం, ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారికి ఆప్షన్లు లేకపోవడంతో ఆందోళ చెందారు. అరబిక్ లాంగ్వేజ్ ఆప్షన్‌ను ఇంటర్, డిగ్రీ కోర్సులకు ఎంపిక చేసుకునేలా మార్పులు చేశారు. ఆయా సమస్యలపై నిరుద్యోగ ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో ఈ మార్పులు అనివార్యమయ్యాయి. ప్రస్తుతం ఆయా పోస్టులకు డిగ్రీలో 35 శాతం మార్కులు ఉన్నప్పటికీ... దరఖాస్తు ప్రక్రియ కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను ఇటీవల నోటిఫికేషన్ జారీజేశారు. నోటిఫికేషన్ అనంతరం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నించగా...అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దానిపై ఒకవైపు ఆందోళనకు దిగుతూ, మరోవైపు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయడంతో పాఠశాల విద్యాశాఖ సవరణలు చేపట్టింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించనుంది. నోటిఫికేషన్ ఇచ్చిన 90 రోజులకు పరీక్షలు నిర్వహించడంపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వ్యవధి ఉండటం వల్ల తమ ప్రిపరేషన్‌కు ఆటంకం కలుగుతుందని వాపోతున్నారు. దీంతోపాటు జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు, ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. వయోపరిమితి పెంచకపోతే చాలామంది దరఖాస్తు చేసేందుకు అనర్హులవుతారని వాపోతున్నారు. మరోవైపు ఏపీ డీఎస్సీలో టెట్ మినహాయించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. తాజాగా బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు డీఎస్సీ రాసేందుకు అర్హత కోల్పోతున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఏపీ టెట్ నిర్వహించారు. ఆ సమయంలో వారు టెట్ పరీక్ష రాయలేకపోయారు. దీంతో బీఈడీ పూర్తిచేసిన వారి కోసం నెల రోజుల గ్యాప్‌తో టెట్ నిర్వహించి... ఆ తర్వాత డీఎస్సీ పరీక్షలు జరపాలని బీఈడీ అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15 వరకు డీఎస్సీకి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల గడువు తేదీ తన్నుకురావడంతో తాజా బీఈడీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ డీఎస్సీ ఎప్పటికి వస్తుందో తెలియదనీ, ఈ డీఎస్సీలో తమకు అవకాశం కల్పించేలా మరో టెట్ నిర్వహించాలని కోరుతున్నారు.

నక్సలిజాన్ని సామాజిక కోణంలోనే చూస్తాం: రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలోనే చూస్తుందని, శాంతి భద్రతల అంశంగా పరిగణించదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని రేవంత్‌రెడ్డికి శాంతిచర్చల కమిటీ నేతలు ఆదివారం విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని సీఎంను కోరారు. ఈ మేరకు శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రేవంత్‌రెడ్డి... నక్సల్స్‌తో చర్చలు జరిపిన అనుభవం జానారెడ్డికి ఉందన్నారు. ఈ అంశంపై జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకొని, మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

సరిహద్దులు ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరు అని వ్యాఖ్యానించారు. కాగా భారతప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ఘాటు పాకిస్థాన్‌నుద్దేశించి ఘాటు హెచ్చరికలు చేశారు. ఉగ్రదాడికి పాల్పడినవారితోపాటు వారికి సహాయం చేసినవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కశ్మీర్‌లో శాంతినెలకొని... సాధారణ జీవన పరిస్థితులు ఏర్పడటం ఉగ్రమూకలకు ఇష్టం లేదన్నారు. మరోపక్క ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరుల కోసం భద్రతా బలగాలు కశ్మీర్‌లోయను జల్లెడపడుతు న్నాయి. ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోంది. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని బందీపురా, పుల్వామా, షోపియాన్ జిల్లాలోని ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేశారు. ఇక పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలకనిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ కేసును జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి ఎన్ఐఏ అధికారికంగా తీసుకుంది. ఇప్పటికే పహల్గాంలోని ఘటనాస్థలంలో ఉన్న ఎన్ఐఏ బృందాలు విచారణ ముమ్మరం చేశాయి.పహల్గాం దాడికి సంబంధించిన అత్యంత కీలక ఆధారమైన ఓ వీడియో ఎన్ఐఏ చేతికి వచ్చింది. బైసరన్‌కు వచ్చే పర్యాటకుల కోసం రీల్స్‌ను చిత్రీకరించే ఓ స్థానిక వీడియో గ్రాఫర్ ఈ దాడి మొత్తాన్ని కెమెరాలో బంధించాడు. దాడి జరిగే సమయంలో అతడు ఓ చెట్టుపై దాక్కొని మొత్తాన్ని చిత్రీకరించాడు. ఆ వీడియోల ఆధారంగా జరిగిన దారుణాన్ని ఓ వరుస క్రమంలో తెలుసుకొనేందుకు జాతీయ దర్యాప్తు సంస్థకు కీలకంగా మారాయి. ఇక ఉగ్రవాదులు పహల్గాంలోకి ఎలా వచ్చారు? ఏ విధంగా కాల్పులకు తెబడ్డారన్న విషయమై నిఘా సంస్థలు కీలక సమాచారం రాబట్టాయి.

నౌకా విధ్వంసక క్షిపణుల పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

అరేబియా సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్(ఎంఆర్-ఎస్ఏఎం) తో 'సీ స్కిమ్మింగ్' పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది.

'తల్లికి వందనం' తక్షణ అమలు

మేరుగు నాగార్జున డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యను పేదలకు దూరం చేస్తున్న దుర్మార్గం సీఎం చంద్రబాబుది అని మాజీ మంత్రి, వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకం పేరు మార్చి తల్లికి వందనం అని ప్రకటించారు కానీ దాని అమలుపై రోజుకో మాట మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాన్ని అమలు చేయకుండా ఖజానా ఖాళీ అంటూ వంకలు వెతుకుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద ఇస్తామన్న సొమ్ము ఏదని ప్రశ్నించారు. రూ. 15వేలను వాయిదాల రూపంలో ఇస్తానని చంద్రబాబు మాట మార్చారన్నారు. తల్లికి వందనంపై విద్యార్థులను వారి తల్లులను మభ్యపెట్టేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని నాగార్జున అన్నారు. తక్షణం తల్లికి వందనం కింద విద్యార్థులకు చెల్లింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీజీహెచ్‌లకు కొత్త సూపరింటెండెంట్లు

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ వి.మన్మథరావును నియమించారు. ఆంధ్ర వైద్య కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి, కాకినాడ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్, నెల్లూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరిని నియమించారు. మరో ఎనిమిది మంది ప్రొఫెసర్లకు వైద్య విద్య అదనపు డైరెక్టర్ హోదా పదోన్నతి కల్పించారు.

దుష్ట సంప్రదాయానికి రోల్‌మోడల్

జత్వానీ కేసుపై మనోహర్‌రెడ్డి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నటి కాదంబరీ జత్వానీతో కూటమి ప్రభుత్వం పెట్టించిన కౌంటర్ కేసు దుష్ట సంప్రదాయానికి రోల్‌మోడల్‌గా ఉందని వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అధికార దుర్వినియోగానికి ఈ కేసు పరాకాష్ట అన్నారు. మేజిస్ట్రేట్ ముందు ఏనాడు పోలీసులపై ఫిర్యాదు చేయని జత్వానీతో ఏడు నెలల తరువాత తప్పుడు ఫిర్యాదు చేయించిందని కూటమి ప్రభుత్వాన్ని నిందించారు. జత్వానీపై దేశ వ్యాప్తంగా కేసులు ఉన్నాయన్నారు. వైసీపీ హయాంలో కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు జరిపి, ముద్దాయి జత్వానీని అరెస్ట్ చేశారన్నారు. జత్వానీపై కేసు పూర్వాపరాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఐ నుంచి డీజీపీ స్థాయి అధికారి సీతారామాంజనేయులు వరకు కేసులు పెట్టారని విమర్శించారు. కక్షసాధింపులకు గురవుతున్న అధికారుల కెరీర్‌లో చిన్న మచ్చ కూడా లేదని, అనేక అవార్డులు, పతకాలు, ప్రశంసలు అందుకున్నారన్నారు.

మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

తదితర 12 విభాగాల్లో వీసాలు ఉన్నవారు 27 వ తేదీతో గడువు ముగిసింది. 'సార్క్' వీసాల కింద భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు ఈనెల 26లోపు దేశాన్ని వీడాలని ఆదేశించింది. ఆ గడువు కూడా ముగిసింది. కాగా, వైద్య వీసాల కింద వచ్చినవారికి 29వ తేదీ వరకు సమయం ఉంది. గత మూడు రోజుల్లో 509 మంది పాకిస్థానీయులు అటారీ సరిహద్దు గుండా తమ దేశానికి తిరిగి వెళ్లారు. అదే విధంగా దాయాది దేశంలో ఉన్న 745 మంది భారతీయులు కూడా స్వదేశానికి తిరిగొచ్చారు.

అగ్నిప్రమాద బాధితులకు రూ.లక్ష తక్షణ సాయం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకవెళ్లి పూర్తి నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పారు. ఈ భూమిని భూ మాఫీయా ఆక్రమించకుండా పార్టీ అడ్డుకున్నదని, ఈ కేసు కోర్టులో ఉన్నదని ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కరించాలని కోరారు. దాదాపు 100 ఎకరాలలో 8 వేల మంది గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారందరికి పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, ఆందోజ్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, కృష్ణ ప్రసాద్, శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరి సింగ్ నాయక్, సైదులు, వంశవర్ధన్ రెడ్డి, మధు,"కేతరాజు నరసింహ, ప్రసాద్, శ్రీదేవి వేణు, సక్రు, నిరంజన్, అరుణ్ పాల్గొన్నారు.

మోదీకి ఎన్నికలే ముఖ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు: దేశంలో ప్రజల మానప్రాణాల కన్నా, ప్రధాని మోదీకి ఎన్నికలే ముఖ్యమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో 26 మందిని ఉగ్రవాదులు పొట్టన పెట్టుకోవటాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఘటనపై కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భద్రతా వైఫల్యాల కారణంగానే ఘటన జరిగిందని ఒప్పుకోవటం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. అయితే ఆ సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకుండా, బీహార్ ఎన్నికల సమావేశంలో పాల్గొనడం దుర్మార్గమన్నారు. దేశంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి పాలన సాగించాలని బీజేపీ చూస్తోం దన్నారు. ఉగ్రవాదులు కూడా లౌకికత్వంతో కూడిన భారత్‌లో మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో టెర్రరిస్టుల భారీ నుండి సయ్యద్ హుస్సేన్ అనే యువకుడు బాధితులను కాపాడేందుకు ప్రయత్నించి అమరుడయ్యాడన్నారు. దేశంలోని హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు సోదర భావంతో మెలుగుతుండగా... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ రాజ్య కాంక్షను కొనసాగించేం దుకు మనుస్మృతి రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్సే

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలని భావించానని, వలసవాదుల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు ఒక్కడినే బయలుదేరానని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ కోసం నేను బయలుదేరిన నాడు కొందరు వెటకారం చేశారన్నారు. అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని వివరించారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. 1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశానని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను, 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసునని చెప్పారు. ఆనాడు కాంగ్రెస్, టీడీపీలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకుని కూర్చున్నారని ఆనాటి దృశ్యాలను గుర్తు చేశారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారని ధ్వజమెత్తారు. "పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే తెలంగాణను నిర్మించుకున్నాం. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతుబంధు పథకం తీసుకువచ్చాను. రైతులు ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకుంది." అని కేసీఆర్ చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్ హామీలు గాలికి...

కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారని, ఢిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలు ఇచ్చారని కేసీఆర్ విమర్శించారు. పింఛను రూ.2 వేలు ఉంటే రూ.4వేలు ఇస్తామన్నారు, మేం రైతుబంధు రూ.10 వేలు ఇస్తే రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని ఆరోపించారు. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు, రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. ధాన్యం తడిసినా, మొలకలు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసేదని గుర్తు చేశారు. భూముల ధరలు ఎందుకు తగ్గాయి, నీళ్లు ఎక్కడికి పోయాయని కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వడ్లు కొనే దిక్కు లేదు, కల్లాల్లో రైతులు ఏడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు వేసుకున్న గుడిసెలను హైడ్రా పేరుతో కూల్చుతున్నారని, ఆనాడు చెరువుల్లో పూడికలు తీసిన బుల్డోజర్లు ఇవాళ ఇళ్లను కూలుస్తున్నాయని అన్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇంత ఆగమైపోతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదని, ఇన్నాళ్లు చూశాను, ఏడాదిన్నర పూర్తయ్యింది ఇంకెప్పుడు చేస్తారని అడిగారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలని అన్నారు. మాట్లాడితే బీఆర్ఎస్ పై నిందలు వేస్తున్నారని ఆగ్రహించారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ యూనివర్సిటీ భూములు అమ్ముతారా అని కేసీఆర్ ప్రశ్నించారు. వైఎస్ఆర్ తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదని కేసీఆర్ అన్నారు. ఎవరు తెచ్చినా బాగున్న పథకాన్ని కొనసాగించాలని చెప్పానని గుర్తు చేశారు. పేరు కూడా మార్చకుండా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని కొనసాగించామని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెట్టుకుంటే ఆటంకాలు సృష్టించారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. పోలీసులకు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

దక్షిణాదిపై కేంద్రం వివక్ష చూపదు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతుందన్న విమర్శలు సరికాదని, బీజేపీ శ్రేణులు ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. దక్షిణ భారతానికి బీజేపీ అన్యాయం చేస్తుందని, పార్లమెంటు సీట్లు కుదిస్తారని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ భవానీపురంలో నిర్వహించిన మేధావుల సదస్సులో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దక్షిణాదిలో కూడా బీజేపీ విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కర్నాటక, తెలంగాణలో అధికారంలోకి వస్తామని, తమిళనాడులో డీఎంకేను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంబేద్కర్ కరడుగట్టిన జాతీయవాది, దేశభక్తిపరుడని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి కొనియాడారు. అంబేద్కర్ జయంతిని ఏప్రిల్ 14వ తేదీనే కాకుండా 10 రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ అధికారాన్ని నిలుపుకోవడం కోసం రాజ్యాంగాన్ని అనుకూలంగా మార్చుకుందన్నారు. మోదీ నాయకత్వంలో భారతదేశ పలుకుబడి పెరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకున్నంత మాత్రాన పేదల గుండె చప్పుడు రాహుల్‌కు తెలియదని ఎద్దేవా చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యలకు పరిష్కారం : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : జిల్లాల్లో ప్రస్తుత వేసవిలో ధాన్యం అమ్మకాలలో, రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు నెలకొని ఉంటే వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, టోల్ ఫ్రీ నెంబర్ 9347416178 కు ఫిర్యాదు చేయవచ్చని, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుగా కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు.

తైక్వాండో ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన గమన్ రెడ్డి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైద్రాబాద్ యూసుఫ్గూడాలో నిర్వహించిన మొదటి ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ 2025 అండర్ 22 కిలోల విభాగంలో నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్ రెడ్డీ గోల్డ్ మెడల్ సాధించాడు. గమన్ రెడ్డీ తాతయ్య నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారంరెండు రోజుల పాటు నగరంలో జరిగిన పోటీలలో ఆదివారం బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు. బ్లాక్ బెల్ట్ గ్రేడ్‌లో ఉన్న గమున్ రెడ్డి ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 8 మెడల్స్ సాధించినట్లు తెలిపారు. 5 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించారన్నారు. 2025లో పంజాబ్, శ్రీలంక, అర్జెంటీనాలో జరగబోతున్న ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధం అవుతున్నట్లు తెలిపారు. హైద్రాబాద్‌లోని అల్కాపూర్ టౌన్షిప్‌లో స్కాలర్స్ అకాడమిలో 5వ తరగతి చదువుతున్న గమన్రెడ్డి కోచ్ సైకం సుబ్బారావు శిక్షణలో ఎస్‌బిటీఎస్ సంస్థలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపాడు. గమన్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తల్లిదండ్రులు ఉదయ్కుమార్రెడ్డి, శోభన, నాయినమ్మ కొణతం విజయలక్ష్మి, శిక్షణ పొందుతున్న సంస్థ నిర్వాహకులు, నేరేడుచర్ల ప్రముఖులు, బంధువులు అభినందనలు తెలిపారు.

ఘనంగా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా రెవిన్యూ శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ప్రథమ వార్షికోత్సవ వేడుక ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం, నగరంలో స్తంభాద్రి బ్యాంక్ చైర్మన్ ఎర్నేని రామారావు అధ్యక్షతన కార్యక్రమ కన్వీనర్ బసవరాజు ఉపేందర్ రావు, కమిటీ సభ్యులు నాగాచారి, సాంబశివరావు, సుదర్శన్‌రావు, శ్రేష్ఠి ఆంజనేయులు, తదితరులతో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధి ఆశర్వాదం, అతిధి ఎమ్ సుధాకర్ విశిష్ట అతిధి ఎమ్ సుబ్బయ్య, సభలో పాల్గొని మంచి సందేశాలిచ్చారు. మొత్తం 179 మంది హాజరు అయినారు. కొత్తగా రిటైర్డ్ అయిన వారు గతంలో రానివారు 39 మందికి మెమెంటో శాలువతో సన్మానించారు. 80 ఏళ్ల వయసుకు పైబడిన వారు సుమారు 9 మంది వచ్చారు. అందరి సహకారంతో కార్యక్రమం నిర్వహించగలిగామని బసవరాజు ఉపేందర్‌రావు తెలిపారు. ఈ కలయిక అందరిని ఒక దగ్గర చేర్చి సంతోషం పంచుకునేందుకు కారణమయింది అని వారు పేర్కొన్నారు. కమిటీ అతిధులను సత్కరించింది. వచ్చే సంవత్సరం 2026 ఫిబ్రవరి నెలలో మహిళా ఉద్యోగులతో కలిపి నిర్వహిస్తామని తెలిపారు.

గాలి శెట్టి కార్టూన్ల సందడి పుస్తక ఆవిష్కరణ....

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తాసిల్దార్ ప్రఖ్యాత, కార్టూనిస్ట్ గాలిశెట్టి వేణుగోపాల్ కార్టూన్లతో రూపొందించిన గాలి శెట్టి కార్టూన్ల సందడి అనే పుస్తకాన్ని ఎర్నేని రామారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కొన్ని ముఖ్యమైన సందర్భాలను తీసుకొని వాటికి అనుగుణంగా కార్టూన్లు వేసి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక, అవార్డులు పొందిన గాలిశెట్టి వేణుగోపాల్ కార్టూన్లు ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భూ భారతితో రైతులకు అనేక ప్రయోజనాలు

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

విశాలాంధ్ర - జిల్లాబ్యూరో మహబూబాబాద్: భూ భారతి చట్టంతో రైతులకు ప్రత్యేకమైన ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం జిల్లాలోని సీరోలు మండల కేంద్రంలోని కాంపెల్లి రైతు వైదికలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, భూభారతి నూతన చట్టంలోని అంశాలు చదివి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ భూభారతి చట్టం ద్వారా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు.

భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా కల్పిస్తుందని అన్నారు.

తమకు న్యాయం జరగలేదని భావిస్తే రైతులు ఆర్డీఓకు, అనంతరం కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని, ల్యాండ్ ట్రిబ్యునల్‌లో కూడా అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్దీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ రెవెన్యూ సదస్సులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, ఏడి సర్వే ల్యాండ్ ఏ.నరసింహమూర్తి, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస నారాయణమూర్తి, ఎంపిడిఓ ఎండి గౌస్, వ్యవసాయ శాఖ అధికారులు ఛాయ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి (శాంతినగర్) ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2004-2005 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వారంతా ఒకరునొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా పాఠశాల ప్రాంగణంలో రోజంతా కాలం గడిపారు. పదో తరగతి పాసై 20 సంవత్సరాలు గడవడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని, విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని వారికి చదువులు నేర్పిన ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులంతా కలిసి మెమొంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులు పోతన పోయిన ముత్తయ్య, జి.మాధవరావు, పూర్ణచంద్రావు, రంగయ్య, పెద్ద రమేష్ బాబు, అంజయ్య, జి వెంకటేశ్వర్లు, రంగయ్య, కరుణమై, ప్రఫుల్ల, ఉషారాణి, సత్యనారాయణ మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన చిన్నారులు తమను గుర్తించుకోని ఈ ఆత్మీయ కలయిక వేడుకకు ఆహ్వానించి సత్కరించడం మరపురానిదన్నారు. ఈ కార్యక్రమంలో 2004-2005 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు ఆవుల వెంకట్రావు, పృథ్వీరాజ్, ప్రసాద్, వీరకుమార్, హరిదాస్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంబు క్లస్టర్‌ను పరిశీలించిన ఎన్జీఓ ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలోని చంద్రు గొండ మండలంలో గల బెండలపాడు గ్రామంలో ఆదివాసి యువకులు నిర్వహిస్తున్న బ్యాంబు క్లస్టర్‌ను ఎన్జీవో ప్రతినిధులు సందర్శించి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనల మేరకు ఆదివారం మహారాష్ట్ర, పుణే నుండి వచ్చిన గుల్లకారి ఫౌండేషన్ ఎన్జీవో బాధ్యులు సుస్మిత కనేరి క్లస్టర్లు విస్తృతంగా తిరిగారు. బ్యాంబో క్లస్టర్ సభ్యులతో ఆమె చాలా సేపు చర్చించారు. ఎంఎస్ఎం ఈ సంస్థ ఆర్థిక సహాయంతో ఆదివాసీలు యువకులు ఏర్పాటు చేసుకున్న ఈ బ్యాంబో క్లస్టర్‌ను ఆమె మెచ్చుకున్నారు. వెదురు కళాకారులకు కొన్ని రకాల డిజైన్లతో గల ప్రొడక్ట్స్ నైపుణ్యత అభివృద్ధి కోసం ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. అలాగే ఇక్కడ తయారు చేసిన ప్రొడక్ట్స్ కు మార్కెటింగ్ అవకాశం కల్పించి సహకరిస్తామన్నారు. కలెక్టర్ చొరవతో ఎన్ఆర్ఇజిఎస్ పథకంలో ఏర్పాటు చేసిన వెదురు మొక్కల పెంపకం నర్సరీను కూడా పరిశీలించారు. బ్యాంబో క్లస్టర్ సభ్యులకు ఆమె విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ వీసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, హమీద్, గోవర్ధన్, రేవంత్, సత్యం, రవి, తదితరులు ఉన్నారు.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

విశాలాంధ్ర- తొర్రూర్: బిఆర్ఎస్ పార్టీ 25 లో అడుగుడుతున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజితోత్సవ సభకు తొర్రూరు పట్టణం, మండలములోని వివిధ గ్రామాలు, తండాల నుండి బిఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ జాతిపితగా పేరుందిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధములుగా అభివృద్ధి చేసి, ముందుకు నడిపిన యోధుడు అని కొనియాడారు. బిఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు, వార్డు అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, మున్సిపల్ 7వ వార్డు అధ్యక్షులు మన్నెం రాములు, మాదుగుల పూలమ్మ-నట్వర్, మాజీ వార్డు సభ్యులు పద్మరాములు, యూత్ నాయకులు మాలిక్, బంధు విజయ, మోటం వెంకన్న, పస్తంహుస్సేన్, నాగరాజు, శ్రీనివాస్, కళావతి, ఎల్లే వెంకన్న, సంధ్య పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వనపర్తి : 139వ మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నగర్ సిపిఐ కార్యాలయం ముందు గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ కార్మికులు కర్షకులు మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎంతో మంది ప్రాణ త్యాగాలతో కార్మిక హక్కులను సాధించుకున్న సందర్భంగా మేడే ఉత్సవాలను జరుపుకుంటామన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను ఈ ప్రభుత్వాలు కాలరాస్తూ నాలుగు లేబర్ కోట్లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మికులు అందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ఏఐటియుసి నాయకులు రమేష్ ఎర్రకురుమయ్య చిన్న కురుమయ్య గంధం శ్రీనివాసులు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐను కలిసిన కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచల పట్టణ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన మండేపల్లి నాగరాజును నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం, గంజాయి, మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు నాయకులతో పాటు ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఇలాంటి ప్రమాదకర అక్రమాలు చేసేవారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బుడిగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్ , మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్ , ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, భద్రాచల హెరిటల్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి, బత్తుల కృష్ణారెడ్డి, భద్రాచల లాడ్జి అసోసియేషన్ మెంబర్ ధనకొండ ప్రసన్న , ఓబీసీ సెల్ నాయకులు రాగం సుధాకర్, ఐ.ఎన్.టి.యు.సి నాయకులు మాగపూ రాజు, ఆర్జి సోషల్ మీడియా అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న ప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో ప్రతి నెలకు వచ్చే అమావాస్య రోజున శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద పంపిణీ నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమావాస్య రోజున తమ వంశ పెద్దలను పూర్వీకులను స్మరిస్తూ అన్న ప్రసాదం పంపిణీ చేయడం తమ ధర్మం పట్ల బాధ్యతగా భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో 500 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, పూటుకురి నటరాజు, వుప్పల పుల్లయ్య, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, పోలిశెట్టి అశోక్, గుండా సత్యనారయణ, బోనగిరి అంజయ్య, కంది బండ సురేశ్, శింగిరి కొండ లచ్చయ్య, గజవెల్లి వెంకటేశ్వర్లు, కందిబండ హరిప్రసాదు, పాలువాయి గోపాలకృష్ణ, జూలూరి అశోక్, చెరుకు రాము, పైడిమర్రి వాసు, అనిల్ గుప్త, కందిబండ బ్రహ్మం, కందిబండ వాసంతి, ఈగా భాగ్యలక్ష్మి, పోలిశెట్టి సరస్వతి, గరిణె జ్యోతి, గరిణ రాధిక తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు తరలిన నాయకులు

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండల బీఆర్ఎస్ నాయకులు వరంగల్ జిల్లాలోని ఎలుకతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు మండలం నుండి బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున బయలుదేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేం వేంకట కృష్ణారెడ్డి తెలుపుతూ గూడూరు మండలం నుండి 2500 మంది బీఆర్ఎస్ శ్రేణులు సభకు బయలుదేరారని 18 బస్సులు 15 డీసీఎం, 25 అశోక్ లేలాండ్, 5 బొలెరో కార్లలో రజతోత్సవ సభకు వెళ్లినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని కాన్వాయిలు బయలుదేరే వేల బీఆర్ఎస్ పార్టీ జెండాను ఊపి సభకు బయలుదేరడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యకర్తలకు వాటర్ బాటిల్, మజ్జిగ, తోపాటు ఆహార పదార్థాలను తీసుకు వెళ్లినట్లు తెలిపారు. నూకల సురేందర్, సీనియర్ నాయకులు వాంకుడోత్ కటార్ సింగ్, వల్లెపు శ్రీను, బానోతు నరసింహ నాయక్, సంపంగి రాములు, బోడ ఎల్లయ్య, బొంత రాములు, కోడి రవి, నమిలి సాంబయ్య, కసరబోయిన అశోక్ తదితరులున్నారు.

వరంగల్ సభకు భారీగా తరలిన బిఆర్ఎస్ కార్యకర్తలు

విశాలాంధ్ర - కారేపల్లి : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బిఆర్ఎస్ మహాసభకు సింగరేణి మండలం నుండి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు, సామాన్య ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని 41 గ్రామపంచాయతీ నుండి ముందుగా గ్రామాలలో నాయకుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ జండా నిగరవేసి సమావేశానికి వెళ్లారు.వైరా నియోజకవర్గ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసిలు వాంకుడోత్ జగన్, ఉన్న వీరేందర్, నాయకులు షేక్ గౌసుద్దీన్, జడల వెంకటేశ్వర్లు, అడప పుల్లారావు, బానోత్ కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్‌తో పాటు ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రత్యేక బస్సులు కార్లలో ప్రయాణమై వరంగల్ సభకు తరలి వెళ్లారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల మారణకాండ అమానుషం

విశాలాంధ్ర - గార్ల : జమ్ము కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన భారత పౌరులకు మండల కేంద్రంలో ఆదివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపైన జరిగిన ఉగ్రదాడిని యావత్ ప్రపంచం విస్తుపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టే అన్ని చర్యలకు యావత్ సమాజం కుల మతాలకతీతంగా మద్దతు ఉంటుందన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలని లౌకికవాదాన్ని కాపాడుకోవాలని ఈ దాడితోనైనా కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం కావాలన్నారు. ఎవరైతే ఈ ధమనకాండ జరపారో వారిని వెంటనే గుర్తించి ఉరి శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేసారు. భారతీయులంతా సమైక్యంగా ఉండాలని కులవివక్ష, మత వివక్ష దేశంలో ఉండకూడదని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సహాయ కార్యదర్శి రాగం రమేష్, ధూపాటి జనార్దన్, లావుడ్య భీముడు, దారావత్ వీరన్న,మాగం లోకేష్, ఇరుగు వెంకటేష్, ఉపెందర్ రెడ్డి, పచ్చిపాల నాగయ్య, మల్లారపు బిక్షం, సింగు రమేష్, దార్ల నాగేష్ శివ, రాగం సత్యం, చౌకాల బిక్షం పాల్గొన్నారు.

30 కేజీల గంజాయి పట్టివేత

లారీతో పాటు ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : హైదరాబాద్ కు చెందిన ఎస్ టిఎఫ్ బి టీం భద్రాచలం ఐటిసి కంపెనీ పార్కింగ్ యాడ్‌లో ఉన్న ఒక లారీ లోంచి 30 కేజీల గంజాయిని ఆదివారం పట్టుకున్నారు. ఐటిసి పేపర్ మిల్లు కోసం అవసరమైన మూడు సరుకు కర్రను తీసుకు వస్తున్న లారీ డ్రైవర్ శివ ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు పక్కా సమాచారంతో పట్టుకున్నారు. ఇతని వెంట అర్జున్ అనే వ్యక్తి కూడా వున్నాడు. ఈ సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై నాగరాజు మిగతా సభ్యులు కలిసి పార్కింగ్ యార్డులో నిలిచి ఉన్న లారీని తనిఖీలు చేయాగ అందులో నుంచి రూ 15 లక్షల విలువ చేసే 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. కాగా డ్రైవర్ శివతో పాటు ఒరిస్సాకు చెందిన అర్జున్ గంజాయి వ్యాపారి కలిసి పలుమార్లు ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకువచ్చి భద్రాచలంలో అమ్మకాలు చేపట్టినట్లు విచారణలో నిందితులు వెల్లడించారు. ఎప్పటి లాగానే ఈసారి కూడా తీసుకువచ్చి ఎస్టిఎఫ్ పోలీసులకు దొరికిపోయారు. గంజాయిని స్వాధీనం చేసుకొని లారీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. డ్రైవర్ శివతోపాటు అర్జున్, ప్రహ్లాద్‌లను అరెస్టు చేసి భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. గంజాయి పట్టుకున్న ఎస్టిఎఫ్ బీ టీంను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్ రెడ్డి, బీ టీం ఇంచార్జ్ ప్రదీప్‌రావులు అభినందించారు.

ఎస్ఐ రాజ్‌కుమార్‌కు అరుదైన గౌరవం

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండలం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజకుమార్‌కు మాదకద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా హైదరాబాద్ డిజిపి కార్యాలయంలో ఆదివారం డిజిపి చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజకుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా నాకు అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. అవార్డుని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా అందుకోవటం ఎంతో ఆనందంగా కలిగించిందన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ కోరారు. తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా భవిష్యత్తులో వారికీ అండగా నిలవాలని కోరారు. ఎస్ఐ రాజ్‌కుమార్‌కు ఈ అవార్డు దక్కడం పట్ల డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, పలువురు ఉన్నత అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన హస్తకళల అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ జిల్లాలో అధికంగా ఉన్న గిరిజన తెగల ద్వారా హస్తకళను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రోత్సహిస్తూ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి జిల్లా పర్యటనలో ఆదివారం పర్యటించారు. నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్ పరిశీలన, అభివృద్ధి మార్గదర్శకంపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లాలో గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సుష్మిత కనేరి జిల్లాలో పర్యటన చేపట్టారు. ఆమె ముందుగా జిల్లా కలెక్టర్ ను కలుసుకున్నారు. గిరిజన హస్తకళల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శక ఆదేశాలపై చర్చించారు. తదనంతరం ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడి గిరిజన కళాకారులు రూపొందిస్తున్న సంప్రదాయ హస్త కళాకృతుల తయారీని, నైపుణ్యాలను ప్రత్యక్షంగా సమీక్షించారు. కళాకారుల నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ లింకేజ్, ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రాచుర్యం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. జిల్లాలోని హెర్పణలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా కలెక్టర్ కృషి చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎపియం వెంకయ్య, డిఆర్ డిఓ, ఐటిడిఎ కార్యాలయాల నుంచి హరి కృష్ణ, అంజన్ పాల్గొన్నారు.

నేడు జరగాల్సిన ప్రజావాణి రద్దు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేడు సోమవారం నిర్వహించవలసిన ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసి మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అందువలన ఫిర్యాదుదారులు సోమవారానికి బదులుగా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై వారి ఫిర్యాదులను సమర్పించాలని కోరారు.

సాహితి

రక్త కన్నీరు



పాక్ ఉగ్రవాదం పంజా విప్పి
సరిహద్దు దాటిన విషపు నీడ
ప్రకృతి ప్రశాంత ప్రదేశమంతా
నరమేధపు వికృత రాక్షసజాడ
ఇప్పుడు... హిమాలయ శిఖరాల నీడలో,
పైన్ వృక్షాల పహారాలో
సందర్శకుల మనసులు దోచే
కాశ్మీరు సుందర వదనం
రక్త కన్నీరుతో తడిసిన గాయం

దాల్ సరస్సు నీలి కలల సౌరభం
గాండ్రింపుల కాల్పులలో కన్నీరైన దృశ్యం
చినార్ ఆకులు రక్తసిక్తమయంగా
శిశిరం రాకుండానే రాలుతున్న దృశ్యం
పుష్పాల లోయలో గులాబీల సుగంధం
తుపాకీ మంటల్లో కాలి బూడిదైంది

శాంతి పావురం ఆకాశంలో గాయపడి
చిరిగిన రెక్కలతో నేల రాలిపోయింది

చినార్ చెట్ల ప్రేమ సాక్షి కాల్పుల నీడలో మౌనం
పొంగిన పాటల కెరటం జల్వా నదిలో రుధిరం
అమ్మఒడిలో పిల్లల కళ్లలో విషాద గాయం
కొనసాగాలా ఇలాగే ఇంకా కలకాలం

ఈ గాయాల నడుమ ఛిద్రమైన కాశ్మీరం కల
చిగురించేందుకు ఉగ్రవాద హింసా చెరలో
శాంతి ఉదయం స్థాపించేందుకు
మతమేదైనా మానవత గొంతుతో
సమైక్య సమరం సాగించాలి

వేల్పుల నారాయణ, 9440433475

కమ్యూనిస్టు పార్టీయే విశ్వవిద్యాలయంగా ఎదిగిన జయకాంతన్

ఊహ తెలిసిన తర్వాత రాజకీయ అభిప్రాయాలు ఏర్పడడం, నిర్దిష్టమైన జీవిత దృక్పథం ఏర్పడడం సహజం. కాని తమిళ రచయిత దండపాణి జయకాంతన్ (24-04-1934 - 8-04-2015) 12 వ ఏటే కమ్యూనిస్టు పార్టీలో ఒదిగి పోయారు. చిన్నతనంలోనే తండ్రి కుటుంబాన్ని వదిలేశారు. జయకాంతన్ చిన్నప్పుడే తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి పాటలు పాడే వారు. బంధువులు రాజకీయాలలో ఉండడం వల్ల ఆయనకు కూడా రాజకీయాల మీద ఆసక్తి కలిగింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు కార్యకర్తలను చూసి స్ఫూర్తి పొందారు. చదువు రాజకీయాలకు ఆటంకంగా ఉంటుందని భావించి ఐదో తరగతిలో ఉన్నప్పుడు స్వస్థలమైన కడలూరుతో పాటు చదువు కూడా వదిలేసి చెన్నై చేరుకున్నారు. కొద్ది కాలం దుకాణాల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. కార్మిక నాయకుడైన మేనమామ దగ్గర నుంచి ఓ సిఫార్సు లేఖ తీసుకుని కమ్యూనిస్టుల సరసన చేరారు. అక్కడ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని ముద్రణాశాలలో అక్షరాలు కూర్చడం, తప్పొప్పులు దిద్దే ప్రూఫ్ రీడర్ పనులు చేశారు. కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలోని కమ్యూన్‌లోనే ఉన్నారు. అక్కడ ఆయనకు జీవానందం, ఆర్.కె.కణ్ణన్, ఎస్. రామకృష్ణన్, బాల దండాయుధం వంటి రచయితలు, కమ్యూనిస్టు నాయకుల సాహచర్యం లభించింది. జయకాంతన్ తల్లి, మేనమామ చిన్నప్పుడే ఆయనకు దేశభక్తి నూరిపోశారు.

అయిదో తరగతి తర్వాత జయకాంతన్ బడికెళ్లలేదు కాని కమ్యూనిస్టు పార్టీయే తన పాలిటి విశ్వవిద్యాలయం అనేవారు. కమ్యూనిస్టు పార్టీ ఆయనకు ప్రపంచ సాహిత్యాన్ని, సంస్కృతిని, రాజకీయాలను, ఆర్థిక శాస్త్రాన్ని, పత్రికా రచనను పరిచయం చేసింది. ఆ తర్వాత ఏడేళ్లకే జయకాంతన్ రచయితగా ఎదిగారు. ఆయన రాసిన మొదటి కథ 1953 లో ప్రచురితమైంది. రిక్షా కార్మికులు, ఒళ్లమ్ముకునే వారు, రౌడీలు, జేబు దొంగలు, ఎంగిలి సిగరెట్ పీకలు ఏరుకుని కాల్చేవారు ఆయన స్నేహితులు. ఇలాంటి వారి స్నేహం వల్ల ఆ వర్గం అంటే తనకు ఎంత మాత్రం ఏవగింపు కలగలేదని చెప్పేవారు. వారితో కలిసి జీవించారు. ఆ వర్గాల జీవన విధానం తన మీద బలమైన ముద్ర వేసిందని జయకాంతన్ అంటారు. వారి జీవితాలలో జ్వాజ్వల్యమానమైన ఉద్వేగం, నిజాయితీ, ప్రేమించే తత్వం, సత్యం ఉంటాయని జయకాంతన్ చెప్పేవారు. అందువల్లే ఆయన అణగారిన వర్గాల వారి జీవితాలను నిఖార్సైన పద్ధతిలో చిత్రించగలిగారు.

తమిళ సాహిత్యంలో జయకాంతన్ ఓ అద్భుతం. కొందరికి ఆయన స్ఫూర్తి ప్రదాత అయితే మరికొందరికి ఓ సవాలు. కొద్ది మందికి గిట్టని వాడు. చాలా మంది ఆయనను సామాజిక విశిష్టత కలిగినవాడిగా పరిగణించారు. సమాజంలోని లోటుపాట్లను, కలతలను చిత్రీకరించినందుకు ఆ వాస్తవిక జీవితాన్ని ఏవగించుకుని ఊహాలోకాల్లో తేలిపోయే వారు ఆయనను ఈసడించుకున్నారు. కాని ఆయన ఆకట్టుకున్నా-రెచ్చగొట్టినా, ఆహ్లాద పరచినా-కలతపెట్టినా, ఉపశమనం కలిగించినా-ఆగ్రహం కలిగించినా, ఓదార్చినా-సవాలు చేసినా ఆయన చాలా శక్తిమంతమైన, వాస్తవికతకు పట్టం గట్టిన రచయిత అని అంగీకరించక తప్పదు. ఆయన రచనలో ప్రబలమైన శక్తి ఉంటుంది. శైలిలో దమ్ము ఉంటుంది. ఆయన రచనల పరిధి విస్తారమైంది. వీటన్నింటి మాటున నర్మగర్భంగా విషయం చెప్పే ఒడుపు, కళాకుశలత ఉంటుంది. అగ్ని ప్రవేశం, శిలానెరంగళిల్ శిలా మణితరగళ్, గంగై ఎంగె పోగిరల్ అన్న మూడు నవలలు ఒక వరసలో రాసినవే. ఆయన రాసిన ఆరు రచనలు సినిమాలుగా వచ్చాయి. కొన్నింటికి ఆయనే స్క్రిప్ట్ సమకూర్చారు.

మొదట జయకాంతన్ కమ్యూనిస్టు పార్టీ పత్రికలలోనే రాసే వారు. ఆ తర్వాత ఆయన రచనలు ప్రచురించడానికి ఆనంద వికటన్, కుముదం, దినమణి కదిర్ వంటి అనేక పత్రికలు బారులు తీరాయి. ఆయన సినిమా రంగంలోనూ తన సత్తా చూపించారు. స్క్రిప్ట్ రచయితగా, దర్శకుడిగా కూడా పని చేశారు. ఆయన తీసిన మొదటి సినిమా ఉన్నైపోల్ ఒరువన్‌కు రాష్ట్రపతి ప్రశంసా పత్రం దక్కింది. పత్రికా రచనలోనూ ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. పత్రికా రచయితగా రాజీ పడకుండా విజయవంతం అయ్యారుగా అంటే విజయం సాధించడాన్ని, రాజీపడడాన్ని సమానార్థకాలుగా భావిస్తున్న దశలో రాజీ పడని పత్రికా రచయితలు విజయవంతం అయ్యే అవకాశమే లేదని సమాధానమిచ్చిన నిర్మొహమాటి జయకాంతన్. అభ్యుదయ సాహిత్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన జయకాంతన్ ప్రగతిశీల రాజకీయ శక్తులకు ఉండే అవకాశాల మీదే అభ్యుదయ సాహిత్యోద్యమం కూడా ఆధారపడి ఉంటుందనే వారు. ఆధునిక లోకోత్తరవాదం, మార్మిక వాస్తవికత వంటి సాహితీ ధోరణులపై



జననం: 24-04-1934 మరణం: 8-04-2015

జయకాంతన్‌కు నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండేవి. వాస్తవికతను విడనాడనంత కాలం ప్రయోగాల వల్ల నష్టం లేదనే వారు.

జయకాంతన్ మరణ శిక్షను గట్టిగా వ్యతిరేకించారు. మరణ శిక్ష అసలు శిక్షే కాదన్నది ఆయన అభిప్రాయం. శిక్షల వల్ల నేరాలు తగ్గవన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. రష్యాలో 1917 లో వచ్చిన అక్టోబర్ విప్లవం మానవాళి కళ్లు తెరిపించిందనే వారు. కాని సోవియట్ పతనం విప్లవ క్రమానికి విఘాతం కాదని, పొరపాట్లు జరిగినప్పుడు సరిదిద్దుకోవడానికి అది ఓ సదవకాశమని చెప్పిన జయకాంతన్‌కు కమ్యూనిస్టు సిద్ధాంతం మీద అచంచలమైన విశ్వాసం ఉండేది. అయితే కమ్యూనిస్టు ఉద్యమం కేవలం కమ్యూనిస్టు పార్టీల మీద ఆధారపడి ఉండదన్న వాస్తవిక అంచనా అయనకు ఉండేది. కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం అనేక రాజకీయ పార్టీలపై ఉందని అనేవారు. ఇదే కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన గొప్ప విజయం అంటారు జయకాంతన్. కమ్యూనిజం, సోషలిజం అన్న భావనలు పార్టీ సరిహద్దులను దాటి విస్తరిస్తున్నాయన్నది ఆయన అంచనా. ప్రేమికుల దినోత్సవాన్ని అడ్డుకునే వారి గురించి ప్రస్తావిస్తూ ఆత్మగౌరవం ఉన్న వారెవరూ ఇలా అడ్డుతగలరు అనేవారు. జయకాంతన్ 15 నవలలు, 30 నవలికలు, 200 కథలతో కూడిన 15 కథా సంపుటాలు, 20 వ్యాస సంకలనాలు ప్రచురించారు. మొదట్లో ఆయన పూర్తిగా అణగారిన వర్గాల జీవిత చిత్రణకే ప్రాధాన్యం ఇచ్చినా తర్వాత మధ్య తరగతి ప్రజల జీవన సరళిని కూడా స్పృశించారు. దానికి తగ్గ భాష వాడారు. మురికి వాడల్లో నివసించే భాష వాడడం దగ్గర నుంచి మధ్య తరగతి జీవితాల చిత్రణకు కులీన వర్గాల భాషలోకి మారడం జయకాంతన్ విషయంలో సునాయాసంగానే జరిగింది. మధ్యతరగతి వర్గం వారి గురించి రాసినా వారిలో కనిపించే కాల దోషం పట్టిన నమ్మకాలను, వైఖరిని దుయ్యబట్టడంలో జయకాంతన్ వెనుకాడ లేదు. మానవతా వాదాన్ని నినాద ప్రాయంగా ఉంచకుండా కొత్త ఎత్తులకు తీసుకెళ్లడం జయకాంతన్ విశిష్టత.

జయకాంతన్ కులీన వర్గాల గురించి రాయడం ఆశ్చర్యం, అనుమానం కలిగించక పోలేదు. ఆయన వైఖరి మారిందన్న అభిప్రాయం కలిగింది. ఆయన కమ్యూనిస్టు పార్టీని వదిలేసి కాంగ్రెస్‌కు దగ్గర కావడం ఈ అనుమానాలను బలపరిచింది. కాని ఆయన రచనా ధోరణిలో మార్పు కనిపించినా ఛాందసత్వంపై పోరాటం ఆపలేదంటే ఆయన ప్రగతిశీల సాహిత్యోద్యమం నుంచి వైదొలగలేదనే అనుకోవాలి. అయితే ఆయనలో చివరకు ఊగిసలాడే ధోరణి కనిపించిన మాట వాస్తవం. దీనికి దేశంలో ఉన్న అనిశ్చిత రాజకీయ ధోరణి కూడా కారణం అయి ఉండవచ్చు. జీవితాన్ని భౌతిక వాద దృష్టితో చూస్తూ బౌద్ధిక వాద కోణంతో ఆలోచించడం మార్క్సిస్టు విధానానికి విఘాతం కలిగించేది కాదని జయకాంతన్ భావించే వారు.

జయకాంతన్ దృక్పథంలో మార్పు స్పష్టంగా కనిపించినా ఆయన నిఖార్సైన మానవతావాది. చదివించే గుణం ఆయన రచనల ప్రత్యేకత. చాలా మంది ఉపేక్షించిన అంశాలను ఆయన తన రచనల్లో ప్రస్తావించారు. ఆయన కృషికి తగ్గట్టుగానే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, సాహిత్య అకాడమీ ఫెలోషిప్, జ్ఞాన పీఠ్, సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు, రష్యన్ ఫెడరేషన్ ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్షిప్ అవార్డు, పద్మ భూషణ్ దక్కాయి.

ఆర్వీ రామారావ్

అనువాద కవిత

చెత్త

మనిషి ముందు పుట్టాడో
లేక
మనిషి పుట్టిన తరువాత
చెత్త పుట్టిందో
చెప్పడం కష్టం
అడవి నుంచి బయలుదేరి
మనిషి ఎప్పుడైతే వచ్చాడో
నగరానికి
ఆలోచనలనే
ప్రాణాంతకమైన జబ్బు గట్టిగా
పట్టేసుకుంది మనిషిని
జీవించే విధానం కూడా మారిపోయింది
కొత్త సుఖాలు, కొత్త ఉత్సాహం యొక్క
జ్యామితిని వెతుకుతూ
తయారు చేసుకుని కొత్త
తంత్ర సూత్రాలని
నేర్చుకున్నాడు మనిషి
కర్మాగారాల క్రాంతియుగంలో
ఒకప్పుడు చెత్త పుట్టి పోయేది.
కాని నాగరికత దాన్ని
తన యుక్తితో ఎంత సమర్థవంతంగా
సంస్కరించిందంటే
అది కరగదు, కుళ్లదు, ఇంకిపోదు
అజాత శత్రువులా రూపం దిద్దుకుంది
అది విరగదు, ముక్కలవదు
గొప్పదీ, ప్రియమైనదీ
అన్ని వైపులా వ్యాపించియుంది
అది విస్తరించిన చెత్త
భూమి నుంచి ఆకాశం వరకూ
అన్ని వైపులా చెత్తే చెత్త
చెత్త వందనీయమైనది అని
నాయకుడు ఇప్పుడే సెలవిచ్చాడు
అది చదువ వీలుకానిది
ఎవరో పిసినారి సెట్టి అంతఃపురంలో
ప్రతి చిన్న పెద్ద తెరమీద
చెత్త రతి క్రీడ చేస్తుంది
రోడ్లపైనా కింద ఆసీనురాలై ఉంది
నదుల గుండెల మీదకి ఎక్కి
కొన్నిచోట్ల నిటారుగా, కొన్ని చోట్ల వంగి,
కొన్నిచోట్ల అస్తవ్యస్తంగా సర్వత్రా వ్యాపించిఉంది
అది ఈ మరణశీలమైన సంసారంలో
అజరామరమై ఉంది.

హిందీ మూలం: డా॥కైలాశ వాజపేయీ
(సాహిత్య అకాడెమీ పురస్కారం గ్రహీత)

తెలుగు అనువాదం:
పారనంది నిర్మల, 99851 03804

సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా కీ.శే. సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం మే 1, 2025, గురువారం సాయంత్రం 5 గంటలకు గుంటూరు బ్రాడీపేటలో గల కొరటాల భవన్‌లో జరుగుతుంది.

ఈ సభకు చలపాక ప్రకాష్ అధ్యక్షత వహిస్తారు. డా. పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారు. డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆత్మీయ అతిథిగా పాల్గొంటారు.

కార్యక్రమంలో భాగంగా కందిమళ్ళ శివప్రసాద్ సోమేపల్లి సాహిత్య పరిచయాన్ని, నానా సోమపల్లి వ్యక్తిత్వాన్ని గురించి తెలియజేస్తారు. సభలో గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాలను ఈ సందర్భంగా ప్రదానం చేయ నున్నారు. కథా పురస్కారం సి. యమునకు (రెక్కలొచ్చాయి), కవితా పురస్కారం ఖాదర్ షరీఫ్‌కు (జీవ రహస్యలిపి) అందజేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఎస్.ఎం. సుభాని, శ్రీ వశిష్ఠ సోమేపల్లి నిర్వహిస్తారు.

ఒక స్వాప్నికుని కథ

గ్రంథ సమీక్ష

రాజశేఖర రాజు
73964 94557

గత సంవత్సరం డిసెంబ్రిస్టు ఖైదీ రష్యన్ చారిత్రక బృహత్ నవలను (700 పేజీలు) రాసి సంచలనం కలిగించిన నాగభూషణ్ గారు (పాలకొల్లు), ఈ ఏడాది 'ఒక స్వాప్నికుని కథ - లెనిన్ సంపూర్ణ జీవిత చరిత్ర' పేరిట మరో అపురూపమైన పుస్తకం (700 పేజీలు, రూ. 500లు) తీసుకొచ్చారు. లెనిన్ వ్యక్తిగత, రాజకీయ జీవితంపై ఇంతవరకు తెలుగు సాహిత్యంలో వచ్చిన పుస్తకాలన్నింటిలోనూ అతి గొప్ప పుస్తకమిది. లెనిన్ సమగ్ర జీవితాన్ని కథరూపంలో రచయిత చెబుతూ పోయారు.

1920 అక్టోబర్ నెలలో సోవియట్ రష్యా తొలి రోజుల సంక్షోభ కాలంలో సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత, చరిత్రకారుడు హెచ్ జి వెల్స్ రష్యా వచ్చి లెనిన్‌ని ఇంటర్వ్యూ చేయడం చాలా హృద్యంగా రాశారు. రష్యా ఘటనల పట్ల రచయిత వ్యాఖ్యగా ఈ పుస్తకం రూపొంది నప్పటికీ ఇదంతా తాను చెప్పినట్లే జరిగి ఉంటుంది అని గట్టిగా భావించే శైలితో రాశారు. 15 సంవత్సరాలుగా రచయిత ఈపుస్తకంపై పరిశోధన చేస్తూ చేస్తూ చివరికి ఇలా తీసుకొచ్చారు. కడు వృద్ధాప్యంలో, అనారోగ్యంతో ఉంటూ కూడా నాగభూషణ్ గారు తెలుగు పాఠకులకు ఇంత గొప్ప పుస్తకం తీసుకువచ్చారంటే అలనాటి తరం నిబద్ధతగా తప్ప మరేరకంగానూ దీన్ని చూడలేం.

ఆసక్తి, అభిరుచి, సోషలిస్టు ఉద్యమాల పట్ల సహానుభూతి ఉన్న వారు తప్పకుండా 'ఒక స్వాప్నికుని కథ'తప్పక తీసుకుని చదవండి.

'ఒక స్వాప్నికుని కథ' పుస్తకానికి రచయిత వెనుకమాట నుండి కొద్ది భాగం-

"లెనిన్ జీవిత చరిత్ర రచన చాలా క్లిష్టమైన రచన. ఆయన జీవిత చరిత్ర ఘట్టాలు పూర్తిస్థాయిలో విలిఖితమైలేవు. ఆయన అమిత వినయశీలి అయినందున ఆయన ప్రచారానికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉన్నాడు. ఆర్భాటాలకు, ఆడంబరాలకూ ఆయన వ్యతిరేకి. అంచేత ఆయన మరణానంతరమే పార్టీ పనుపున ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ కామ్రేడ్లు కొన్ని వివరాలు, స్మృతుల రూపంలో రాశారు. అంతేగాక ఆయన తన కుటుంబసభ్యులకు, మిత్రులకు, కామ్రేడ్లకు కూడా కొన్ని లేఖల్ని రాశాడు. వాటిలో కొన్ని నశించిపోగా, కొన్ని దొరుకుతున్నాయి. వాటివల్లే ఈ మాత్రమైనా ఆయన జీవిత విశేషాలు కొన్ని తెలిసే అవకాశం ఏర్పడింది. పార్టీపరంగా ఆయన మరణానంతరం ఆయన సంక్షిప్త జీవిత చరిత్ర ప్రకటించారు గానీ, దాని ద్వారా ఎక్కువ విషయాలు తెలియడంలేదు. అందుకోసం ఆయన రాసిన వివిధ రచనలు, ఇంకా ఆయనపై వచ్చిన వివిధ రచనలు, స్టాలిన్ రాసిన బోల్షివిక్ పార్టీచరిత్ర తెలుగులో, ఆంగ్లంలో లభిస్తున్న రకరకాల సమాచారం ఆధారంగా చేసుకుని ఒక సమగ్ర పరిశోధక ప్రాజెక్టుగా ఈ గ్రంథరచనను చేపట్టి పూర్తిచెయ్యడం జరిగింది.

మొదట ఈ రచనను కథలు లేకుండా కేవలం ఆయన రచనలు, పార్టీ నిర్మాణం, విప్లవ విజయం, ప్రభుత్వ స్థాపన, పాలన వంటి అంశాలతో కూడిన పూర్తిస్థాయి రాజకీయ జీవిత చరిత్రగా రాయాలనుకుని ఇంతకంటే పెద్దగా ఒక బృహద్గ్రంథాన్ని సిద్ధం చేశాను. కానీ ప్రస్తుతకాలంలో ఇలాంటి భారీ రాజకీయ గ్రంథాన్ని పాఠకులు ఆదరించరేమోనన్న ఆలోచన, రాజకీయ అంశాలు క్లుప్తం చేసి, రాసిన కథల ద్వారా ఆయన రాజకీయ కృషిని వివరించే ఆలోచన వచ్చి, మొత్తం 22 కథలతో కలిపి ఈ రచనను ప్రచురిస్తున్నాను. ఆయనగావించిన రాజకీయ కృషి ఆధారంగా కథలు రాయడానికి ప్రధాన ప్రేరణ ప్రసిద్ధ రష్యన్ రచయిత శ్చెద్రీన్ కాగా, కొంతవరకు 'లెనిన్ జీవిత కథ' రాసిన 'మరీయ ప్రిలెజోయెవా'. ఇంకా ఈ రచనకు అమెరికన్ జర్నలిష్టులైన జాన్‌రీడ్, అల్బర్ట్‌రీస్ విలియమ్స్‌ల రచనలు, కూడా కొంత వరకు ఉపకరించాయి. వీరందరికీ, ఇంకా కొన్ని లెనిన్ కథలు ప్రచురించిన పత్రికల వారికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు. అలాగే నాకు లెనిన్ రచనలు, తదితర గ్రంథాలు అందించి ప్రోత్సహించిన మిత్రులకూ్కడా కృతజ్ఞతలు.



అయితే ఎన్ని గ్రంథాలు, రచనలు, వెబ్‌సైట్లు ఉపకరించినా, స్వీయ పరిశోధనతో అనేక వాస్తవాంశాలను కూడా ఇందులో చేర్చాను. అంచేత ఈ రచనను 'లెనిన్ సంపూర్ణ జీవిత చరిత్ర'గా పేర్కొనడం జరిగింది. ఇలా పేర్కొనడం దానికి గల పూర్తి అర్థంలో సరికాదు. ఎందుకంటే ఆయన జీవితంలో ఎదురైన 'అన్ని' అంశాలు ఇందులో ఉన్నాయనడం కూడా సత్యదూరమే. సంక్షిప్త రచనలు తెలుగులో ఉన్నందున, వాటి పరిమితిని, అలాగే దీని విస్తృతిని తెలిపేందుకే దీన్ని 'సంపూర్ణ జీవిత చరిత్ర' గా పేర్కొనడం జరిగింది. మరొక విషయం కూడా కొంత ఇక్కడ చెప్పాల్సి ఉంది. కొద్ది పుస్తకాల్లో పేర్కొన్న కొంత సమాచారం, అలాగే కొన్ని వెబ్‌సైట్లలోని సమాచారం పాఠకుల్ని తప్పుదోవ పట్టించేవి నన్ను కూడా తికమక పెట్టాయి. అయినప్పటికీ సత్యశోధన దృష్టి, హేతుజ్ఞానం, ఇతరాలైన చరిత్ర గ్రంథాలు వగైరాల ఆధారంగా వాస్తవమేమిటో గ్రహించి రాసేందుకు ప్రయత్నించాను. అంతే తప్ప ఇందులో నా నమ్మకాలు వగైరాలకు తావు లేకుండా రాసేందుకు ప్రయత్నించానని దృఢంగా చెప్పగలను.

ఈ గ్రంథంలో లెనిన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు, ఆయన రచనలు సంక్షిప్త పాఠాలు, పార్టీ నిర్మాణం, విప్లవ పోరాటం, ప్రభుత్వ స్థాపన పాలన, అంతర్యుద్ధం ముఖ్య ఘట్టాలు, మూడో ఇంటర్నేషనల్ స్థాపన, ఆయన అంతిమ ఘడియలు వగైరా అంశాలన్నీ వివరంగా ఉన్నందున, ఈ రచన వివిధ లెఫ్టు పార్టీల అభిమానులకు, సామాన్య కార్యకర్తలకు, కూడా ఉపయోగకరంగా ఉంటుందనుకుంటున్నాను.

ఒక స్వాప్నికుని కథ (లెనిన్ సంపూర్ణ జీవితచరిత్ర)
ఎన్.వి.ఎస్ నాగభూషణ్
704 పేజీలు, వెల : రూ. 500/-
రచయిత సెల్ : 9493474836

మోదీ పాలనలో కశ్మీర్ కల్లోలం!

- ఉగ్రవాదాన్ని అంతమొందిస్తామన్నది ఉత్తమాటే
- దాడుల్లో 147 మంది సైనికులు, పౌరులు మృతి
- 11 ఏళ్లలో 11 ఉగ్రదాడులు

న్యూదిల్లీ: బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉగ్రదాడులు తగ్గాయని, ముష్కర మూకలకు మోదీ ప్రభుత్వం ముకుతాడు వేసిందంటూ ప్రచారం జరుగుతోంది. తమ హయాంలో ఉగ్రవాదాన్ని అంతమొందించామంటూ నేతలు ప్రగల్భాలు పలికారు. అయితే... వాస్తవ పరిస్థితులను విశ్లేషిస్తే ఇదంతా ఉత్త మాటగానే నిర్ధారణ అవుతోంది. 2014లో మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత పదకొండేళ్లలో ఒక్క జమ్మూకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడులు జరిగాయి. 103 మంది సైనికులు, 44 మంది పౌరులు మృతి చెందారు. 213 మంది క్షతగాత్రులయ్యారు. 2014 డిసెంబరులో కశ్మీర్ లోయ, బారముల్లా జిల్లా ఉరి ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో 17 మంది సైనికులు మృతి చెందారు. జనవరి, 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ స్టేషన్‌పై జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడికి తెగబడడంతో ఎనిమిది మంది సైనికులు, ఒక పౌరుడు మృత్యువాతపడ్డారు. అదే ఏడాది జూన్‌లో పుల్వామా జిల్లా పాంపోర్‌లో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై లష్కరే తొయిబా ఉగ్రవాదుల మెరుపు దాడులు చేయడంతో ఎనిమిది మంది జవాన్లు అమరులయ్యారు. సెప్టెంబర్‌లో బారాముల్లా జిల్లా ఉరి ఆర్మీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌పై జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడి చేయడంతో 19 మంది జవాన్లు మృతిచెందారు. నవంబర్‌లో జమ్ము జిల్లా నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదులు దాడికి తెగబడంతో ఏడుగురు జవాన్లు అమరులయ్యారు. 2017, జులైలో అనంత్‌నాగ్‌లో అమర్‌నాథ్‌యాత్రకు వెళ్తున్న పర్యాటకుల బస్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఎనిమిది మంది పౌరులు మృతి చెందారు. ఫిబ్రవరి, 2019లో పుల్వామా సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జైషే మొహమ్మద్ ఉగ్రవాదుల దాడి చేయడంతో 40 మంది జవాన్లు ప్రాణాలు వదిలారు. జూన్, 2024లో రియాసీ జిల్లాలో యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రదాడి జరగడంతో తొమ్మిది మంది పౌరులు అశువులుబాశారు. జూలై, 2024లో దొడాలో సైనికులపై కాల్పులు జరపడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. ఏప్రిల్, 2025లో అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో పర్యాటకులపై టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు దాడులు చేయడంతో 26 మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. 2014 కంటే ముందు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా దేశంలో వివిధ చోట్ల ప్రధాన ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. 2002లో అక్షర్‌ధామ్ ఆలయంపై, 2001లో పార్లమెంట్‌పై, 2000లో పహల్గామ్-అమర్‌నాథ్ యాత్రికులపై, 1999లో ఐసీ 814 విమానం హైజాక్, కార్గిల్ యుద్ధం జరిగింది.

జడ్జిలు లేకనే గుట్టలుగా కేసులు: దిల్లీ హైకోర్టు

న్యూదిల్లీ: న్యాయస్థానాల్లో జడ్జిల కొరత తీవ్రంగా ఉందని దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. జనాభాకు తగ్గట్లుగా న్యాయమూర్తులు లేక చాలా కేసులు అసలు విచారణకు రావడం లేదని, కేసులు గుట్టలుగా పేరుకుపోతున్నాయని వ్యాఖ్యానించింది. కొన్ని వ్యవహారాలను ఎప్పుడు స్వీకరించాలో కూడా జడ్జిలు తేల్చుకోలేకపోతున్నారని, ఇది చాలా ఇబ్బందికరంగా మారిందని జస్టిస్ గిరీశ్ కల్పాలియా అన్నారు. తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడం కోసం, సామాజిక అనుబంధాన్ని పెంచుకునేందుకు జార్జియా, కజకిస్థాన్, అల్మటీలో రోటరీ క్లబ్ సమావేశానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ మోసం, ఫోర్జరీ కేసులో ఆరోపి పిటిషన్‌ను విచారించిన సందర్భంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిర్యాది విదేశీ యానానికి మే1 నుంచి 11వ తేదీ వరకు అనుమతి ఇచ్చారు. రూ.5 లక్షల వ్యక్తిగత బ్యాండ్, అంతే మొత్తంతో షరిటీ బాండ్ సమర్పించాలని జస్టిస్ గిరీశ్ ఆదేశించారు. తీర్పు సమయంలో కోర్టుల్లో జడ్జిల కొరత తీవ్రంగా ఉండటాన్ని ప్రస్తావించారు. పరిమిత కాలంలో ఫలానా కేసులు విచారిద్దామంటే కుదరని పరిస్థితి ఉందని... కొన్నిసార్లు విరామం/సెలవలకూ ఆస్కారం ఉండదన్నారు. పని వేళలు ముగిసే సమయానికి కూడా ఆ రోజుకు లిస్ట్ అయిన కేసులు విచారణకు రాలేని పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. చాలా సందర్భాల్లో కోర్టు సమయం ముగిసినా... సాయంత్రం 5 తర్వాత కూడా పని చేసినా ఆ రోజుకు సంబంధించిన కేసున్నీ విచారించే స్థితి ఉండదన్నారు. ఇటువంటి అనిశ్చితి పరిస్థితుల్లో ఫిర్యాదులను ప్రయాణించకుండా నిషేధించడం న్యాయం కాదని, అందుకే ఫిర్యాదికి విదేశాలకు వెళ్లేందుకు అనుమతిచ్చినట్లు జస్టిస్ గిరీశ్ వెల్లడించారు.

22 గంటలు నడిచొచ్చి ప్రాణాంతక దాడి

- ఉగ్రవాదుల్లో ముగ్గురు పాకిస్థానీలు, ఒకరు స్థానికుడు
- పహల్గాం ఘటనపై నిఘా సంస్థల కీలక సమాచారం

న్యూదిల్లీ: 26 మంది టూరిస్టుల ప్రాణాలను తీసిన పహల్గాం ఉగ్ర దాడిలో కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఉగ్రవాదుల ప్రణాళిక... వారికి సాయం చేసిన వారి గురించి నిఘాసంస్థలు కీలక సమాచారాన్ని రాబట్టాయి. ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు, ఒకరు స్థానిక ఉగ్రవాది దాడిలో పాల్గొన్నారు. ఫోరెన్సిక్ విశ్లేషణ ప్రకారం, ఉగ్రవాదులు ఎకె47, ఎం4 రైఫిల్స్ వాడినట్లు తెలిసింది. అత్యంత క్లిష్టతరమైన హిమాలయాలు, దట్టమైన అరణ్యాల్లో గంటల కొద్ది ప్రయాణించి పహల్గాం చేరినట్లు తెలుస్తోంది. కొకెర్నాగ్ అడవుల నుంచి బైసరన్ లోయకు దాదాపు 20-22 గంటల కష్టతరమైన భూభాగం గుండా నడిచి వచ్చి ప్రాణాంతక దాడిని అమలు పరిచినట్లు సమాచారం. దాడి సమయంలో ఉగ్రవాదులు రెండు మొబైల్ ఫోన్లు లాక్కున్నారు. ఒకటి స్థానికుడిది కాగా, మరొకటి పర్యాటకుడిది. స్థానిక ఉగ్రవాదిని ఆదిల్ థోకర్‌గా భద్రతా బలగాలు గుర్తించాయి. థోకర్ 2018లో హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరాడు. పాకిస్థాన్ వెళ్లి శిక్షణ పొందాడు. 2024లో కశ్మీర్ లోయకు తిరిగి వచ్చే ముందు లష్కరే తోయిబాతో యుద్ధ శిక్షణ పొందాడు. తిరిగి వచ్చినప్పటి నుంచి థోకర్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు లాజిస్టిక్ సాయం అందిస్తున్నాడు. కశ్మీర్ భౌగోళిక స్వరూపంపై ఉగ్రవాదులకు సమాచారం ఇచ్చాడు. పహల్గాం దాడి సమయంలో దుకాణాల వెనుక నుంచి ఇద్దరు ఉగ్రవాదులు పాయింట్ బ్లాంక్ రేంజ్ నుంచి నలుగురిని కాల్చి చంపారు. దీనికి ముందు వారిని కల్మా పఠించమని ఆదేశించినట్లు తెలుస్తోంది. కాల్పులతో ఒక్కసారిగా పర్యాటకులు భద్రత కోసం అన్ని దిశల్లో పరుగులు తీశారు. అదే సమయంలో జిప్ లైన్ ప్రాంతం దగ్గర ఉన్న మరో ఇద్దర ఉగ్రవాదులు కాల్పులు జరిపి రక్తపాతాన్ని మరింత తీవ్రం చేసినట్లు సమాచారం. ఘటన సమయంలో స్థానిక ఫోటో గ్రాఫర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనను ఆయన రికార్డ్ చేయగలిగాడు. ఇది ఇప్పుడు భద్రతా బలగాల దర్యాప్తుకు కీలకంగా మారింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారిస్తోంది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. లోయలోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారు, పారిపోయారనే విషయాలను నిశితంగా గనిస్తున్నారు.

48 గంటల్లో పొలాలు ఖాళీ చేయండి

పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ సూచన

చండీగఢ్: పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయింది. త్రివిధ దళాలను సిద్ధం చేసింది. ఏ క్షణమైనా పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ తాజాగా నోటీసులు జారీ చేసింది. భారత్-పాక్ ఉద్రిక్తతల కారణంగా 48 గంటల్లో జీరో లైన్ వెంబడి పొలాలు ఖాళీ చేయాలని రైతులకు బీఎస్ఎఫ్ సూచించింది. సరిహద్దు భద్రతా దళం జీరో లైన్ వెంబడి ఉన్న రైతులకు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. వేలాది మంది పంజాబ్ రైతులు జీరో లైన్ వెంబడి సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో పొలాలు కలిగి ఉన్నారు. వారు పండించిన పంటలు ఇప్పుడు చాలా వరకూ చేతికందాయి. దీంతో వెంటనే పంట కోసి ఇళ్లకు తెచ్చుకోవాలని, లేదంటే నిలువెత్తు పంటల్లో విద్రోహులు దాక్కుని దాడి చేసే ప్రమాదముందని రైతులకు ఇచ్చిన నోటీసుల్లో బీఎస్ఎఫ్ వివరణ ఇచ్చింది. భారత్- పాకిస్తాన్ మధ్య 530 కి.మీ పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. దీని వెంబడి దాదాపు 45 వేల ఎకరాల భూమిని మన రైతులు సాగు చేస్తున్నారు. అమృత్‌సర్‌లోని రౌడా వాలా ఖుర్ద్‌లోని స్థానిక గురుద్వారా కూడా బీఎస్ఎఫ్ నోటీసుకు సంబంధించి ప్రకటన చేసింది. రౌడా వాలా ఖుర్ద్ మాత్రమే కాకుండా, తర్న్ తరణ్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్ జిల్లాల్లోని గ్రామాలలో ఉన్న గురుద్వారాలు కూడా ఇలాంటి ప్రకటనలు చేశాయి. గురుద్వారా రైతులు వీలైనంత త్వరగా పంటలు కోయాలని కోరుతున్నాయి. ఎందుకంటే యాక్సెస్ గేట్లు త్వరలో మూసివేయబడతాయని ఆయా గురుద్వారాలు సరిహద్దు ప్రాంత రైతులను అప్రమత్తం చేస్తున్నాయి. పొలాల్లో ఏపుగా పెరిగిన పంటలు సరిహద్దులోకి చొరబడటానికి ప్రయత్నించే విద్రోహుల అడుగు జాడల్ని కనిపించకుండా చేస్తాయి. జీరో లైన్ వెంబడి ఉన్న ప్రాంతాలు ఖాళీగా ఉంటే, కీలకమైన ప్రాంతాల వెంబడి నిఘా పెంచుకునేందుకు మన భద్రతా దళాలకు వీలు చిక్కుతుంది.

మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్లు కూల్చివేత

శ్రీనగర్: పహల్గాం దాడి నేపథ్యంలో ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేత కొనసాగుతోంది. ఇప్పటికే కొందరు ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేసిన భద్రతాదళాలు తాజాగా మరో ముగ్గురి ఇళ్లను నేలమట్టం చేశాయి. జమ్మూకశ్మీర్‌లోని బందీపురా, పుల్వామా, షోపియాన్ జిల్లాలోని ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం రాత్రి షోపియాన్ జిల్లాలోని వందినా ప్రాంతంలోని ఉగ్రవాది అద్నాన్ షఫీ ఇంటిని కూల్చివేశారు. ఇతడు గతేడాది ఉగ్రవాదిగా మారి క్రియాశీలంగా ఉన్నాడు. దీంతో పాటు పుల్వామా జిల్లాలోని అమిర్ నాజిర్? అనే యాక్టివ్ ఉగ్రవాది ఇంటిని కూల్చివేశారు. బందీపురా జిల్లాలోని లష్కరే ఈ తోయిబా ఉగ్రవాది జమీల్? అహ్మద్? షేరిగోజ్రి ఇంటిని భద్రతాదళాలు నేలమట్టం చేశాయి. ఇతడు 2016 నుంచి ఉగ్రవాద సంస్థలో చురుగ్గా ఉన్నాడు. వీటితో కలిపి ఇప్పటి వరకు భద్రతాదళాలు 9 మంది ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేశాయి. అంతకుముందు శుక్రవారం రాత్రి మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్లను భద్రతాదళాలు కూల్చివేశాయి. కుల్గాంలో లష్కరే తోయిబా ఉగ్రవాది జకీర్ అహ్మద్ గనీకి చెందిన నివాసం కూల్చివేశారు. 2023 నుంచి ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నట్టు అధికారులు తెలిపారు. షోపియాన్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది షాహిద్ అహ్మద్ కుట్టాయ్ ఇంటిని కూడా కూల్చేశారు. పుల్వామాలో మరో అనుమానితుడు అహ్సన్ ఉల్ హక్ షేక్ ఇల్లు పేలుడులో ధ్వంసమైంది. వారందరిపై ఇప్పటికే కేసులు నమోదై నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరుల్లో ఒకడైన ఆదిల్ హుస్సేన్ థోకర్, మరో ఉగ్రవాది ఆసిఫ్ షేక్ ఇళ్లను ఇంతకుముందే నేలమట్టం చేశారు. వేర్వేరు ఘటనల్లో ఆయా నివాసాలు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు.

సరిహద్దుల్లో కాల్పులు

పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ సరిహద్దు వెంబడి మరోసారి కాల్పుల కలకలం రేగింది. పాక్ సైన్యం వరుసగా మూడురోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడింది. నియంత్రణ రేఖ వెంబడి పలు ప్రాంతాల్లో ఆదివారం పాక్ కాల్పులు జరిపింది. దీన్ని భారత సైన్యం సమర్థంగా స్పందించినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 26-27 మధ్య అర్ధరాత్రి ఈ నియంత్రణ రేఖ వెంబడి ఉన్న తుత్మారి గలి, రాంపూర్ సెక్టార్లలో ఈ కాల్పులు జరిగినట్లు అధికాలు పేర్కొన్నారు. వాటిని భారత్ సైన్యం కూడా సమర్థంగా తిప్పికొట్టిందని అన్నారు. గత రెండు రోజులుగా పాక్ ఎల్ఓసీ వద్ద కాల్పులు జరుపుతోంది. దీంతో భారత్ సైన్యం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఇక పహల్గాం దాడి జరిగిన వెంటనే ఉద్రిక్తతలను అంచనా వేసిన అధికారులు పారామిలిటరీ సైన్యానికి ఇచ్చిన సెలవులను సైతం రద్దు చేసి, వెంటనే తిరిగి రావాలని ఆదేశాలు జారీ చేశారు. జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని మోహరించారు.

ఉగ్రదాడి బాధితుడి ఇంటికి కేరళ సీఎం

తిరువనంతపురం: పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన ఎన్.రామచంద్రన్ (65) ఇంటికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదివారం వెళ్లారు. ఆర్థికమంత్రి కేఎన్ బాలగోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్‌తో కలిసి ఆయన ఎడపల్లి మంగట్టు రోడ్డులోని నివాసానికి వెళ్లారు. రామచంద్రన్ భార్య షీలా, కుమార్తె ఆరతిని విజయన్ ఓదార్చారు. కుటుంబ సమేతంగా విహారయాత్రకు వెళ్లిన రామచంద్రన్‌ను కుమార్తె, మనవళ్ల ముందే ఉగ్రవాదులు కాల్చి చంపారు. 'అక్కడ ప్రాణాలు కోల్పోయిన వారిలో కేరళీయుడు కూడా ఉండడం మా బాధను రెట్టింపు చేసింది' అని విజయన్ అన్నారు.

పాకిస్థాన్‌తో వాణిజ్యం నిలిపివేత

పరిశ్రమల సమాఖ్య నిర్ణయం

భువనేశ్వర్: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. భువనేశ్వర్‌లో జరిగిన సీఏఐటీ రెండు రోజుల జాతీయ పాలక మండలి సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. దీనికి 26 రాష్ట్రాల నుంచి 200 మంది వాణిజ్యవేత్తలు హాజరయ్యారు. సీఏఐటీ ప్రధాన కార్యదర్శి, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ సమావేశం దాడిని తీవ్రంగా ఖండించిందన్నారు. 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న బలమైన చర్యలకు వ్యాపారులు పూర్తి మద్దతు ప్రకటించారు. నేరస్థులు, వారి మద్దతుదారులను కఠినంగా శిక్షించాలని కోరారు' అని సీఏఐటీ ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యాటకులను దారుణంగా చంపినందుకు నిరసనగా పాకిస్థాన్‌తో అన్ని దిగుమతులు, ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తామని తీర్మానం పేర్కొంది.

ఈడీ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దక్షిణ ముంబైలో ఈడీ కార్యాలయం ఉన్న కైసర్-ఐ-హింద్ భవనంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.31 గంటల సమయంలో నాలుగో అంతస్తులో ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మొత్తం 12 ఫైరింజన్‌లు, జెట్టీలు, వాటర్ ట్యాంకర్‌ల సాయంతో మంటలను ఆర్పారు. అగ్నికీలలు పెద్ద ఎత్తున ఎగిసి పడటంతో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక బృందం కొన్ని గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. కార్యాలయంలోని వివిధ దస్త్రాలు కాలిపోయాయి. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. ఎయిర్‌పోర్టును బాంబులతో పేల్చివేయబోతున్నామని ఆదివారం ఉదయం ఓ అగంతకుడు ఎయిర్‌పోర్టు వెబ్‌సైట్‌కు మెయిల్ పంపించాడు. దాంతో ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌ను పిలిపించి ఎయిర్‌పోర్టు అంతటా అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడా బాంబు లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించే పనిలోపడ్డారు.

మహిళ కడుపు నుంచి అతిపెద్ద కణితి తొలగింపు

న్యూదిల్లీ: దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు రోబోటిక్ సర్జరీ ద్వారా ఓ రోగి కడుపులో నుంచి అతిపెద్ద అడ్రినల్ కణితిని విజయవంతంగా తొలగించారు. 36ఏళ్ల మహిళ కడుపులో భారీ అడ్రినల్ కణితి ఉన్నట్లు వైద్యపరీక్షల్లో నిర్ధరణ అయింది. ఈ నేపథ్యంలో సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు పవన్ వాసుదేవా, నీరజ్ కుమార్, అవిషేక్ మండల్ కలిసి మూడు గంటలపాటు శ్రమించి రోగి శరీరం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద కణితిని తొలగించారు. ఈ ట్యూమర్ 18.2×13.5 సెం.మీల కొలతలు కలిగి ఉందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సందీప్ బన్సల్ తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అడ్రినల్ కణితి అని వెల్లడించారు. దీనిని కనిష్ఠ ఇన్వాసివ్ ప్రక్రియ ద్వారా రోబోటిక్ సర్జరీ చేసి తొలగించారని పేర్కొన్నారు. ఈ సర్జరీ చాలా ప్రమాదకరమని కణితిని తొలగించిన వైద్యుల్లో ఒకరైన డాక్టర్ పవన్ వాసుదేవా తెలిపారు. ఎందుకంటే కణితి చాలా పెద్దదిగా మారడమే కాకుండా శరీరంలోని మూడు ముఖ్యమైన అవయవాలైన ఇన్ఫీరియర్ వీనా కావా, కాలేయం, కుడి మూత్రపిండానికి కూడా తగిలి ఉందని చెప్పారు. దీంతో కణితి చుట్టుపక్కల ఉన్న శరీర భాగాలకు ఇబ్బంది తలెత్తకుండా దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని వెల్లడించారు.

ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదు

ప్రధాని మోదీ

న్యూదిల్లీ: పహల్గాంలో 26 మంది అమాయకుల ప్రాణాలు బలి తీసుకున్నవారందరూ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడి తనను ఎంతగానో కలచివేసిందని, ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ, ఈ మేరకు పహల్గాం ఉగ్రదాడి బాధితులకు భరోసా ఇచ్చారు. దేశంలో ఎన్నో మతాలు, కులాలు, భాషలు ఉన్నప్పటికీ, ప్రజలంతా బాధితులకు అండగా నిలిచారని, ఇదే భారత్‌లో ఉన్న గొప్పదనమని కీర్తించారు. "పహల్గాంలో జరిగిన దాడి ఉగ్రవాదుల నిరాశను, వారి పిరికితనాన్ని చాటుతోంది. ఇలాంటి సమయంలో కశ్మీర్‌లో తిరిగి శాంతి నెలకొనటం, పాఠశాలలు, కళాశాలల్లో చైతన్యం, నిర్మాణ పనుల్లో వేగం, ప్రజాస్వామ్యం బలోపేతం, పర్యాటకుల సంఖ్య రికార్డ్ స్థాయిలో పెరగటం, ప్రజల ఆదాయం పెరగటం, యువతకు నూతన అవకాశాలు పెరగటం దేశం, జమ్ముకశ్మీర్ శత్రువులకు మింగుడు పడలేదు. ఉగ్రవాదులు, వారిని వెనకుండి నడిపించేవారు కశ్మీర్ మళ్లీ నాశనం కావాలనుకున్నారు. అందుకే ఇంతపెద్ద కుట్ర పన్నారు. బాధిత కుటుంబాలకు నేను మరోసారి భరోసా ఇస్తున్నాను. వారికి న్యాయం లభిస్తుంది. న్యాయం లభించి తీరుతుంది. ఉగ్రదాడి చేసినవారికి, అందుకు కుట్ర చేసిన వారికి గట్టిగా బదులిస్తాం." అన్నారు. ఉగ్రవాదంపై పోరాటం, దేశ ప్రజల ఐక్యత, 140కోట్ల మంది ప్రజల సంఘీభావం దేశానికి అతిపెద్ద బలమన్నారు. మనలో ఉన్న ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని దేశ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. ఈ దాడిని భారత ప్రజలు ఒకే గొంతుతో వ్యతిరేకించడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మరోసారి కృతజ్ఞతలు చెప్పారు. దేశంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాల్సిన సమయం వచ్చిందని మోదీ వెల్లడించారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని బయటకు లాగుతామని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని హెచ్చరించారు.

తక్షణమే పార్లమెంటు ప్రత్యేక భేటీ

కపిల్ సిబల్ డిమాండ్

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో మే నెలలో వీలైనంత త్వరగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆదివారం రాజకీయ పార్టీలను అభ్యర్థించారు. 'ఈ దుఃఖ సమయంలో దేశ ఐక్యతను చూపించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేను సూచించాను. మే నెలలో వీలైనంత త్వరగా అటువంటి సమావేశం ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని నేను అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నాను' అని తెలిపారు. దేశం ఐక్యంగా ఉందన్న సందేశాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని పిలిచి తీర్మానం చేయాలని సిబల్ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి వచ్చేలా అధికార, ప్రతిపక్ష ఎంపీల ప్రతినిధుల బృందాలను వివిధ ముఖ్యమైన దేశాలకు పంపాలని సిబల్ ప్రభుత్వానికి సూచించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ప్రసంగించిన కేంద్రమాజీ మంత్రి... అమెరికా తన ఆంక్షలతో చేసినట్లే... ఇస్లామాబాద్‌తో వాణిజ్యం కలిగి ఉంటే భారత మార్కెట్‌కు రాలేమని పాకిస్థాన్‌తో వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్న అన్ని ప్రధాన దేశాలకు భారతదేశం చెప్పాలని సూచించారు.

వ్యూహాత్మక నిర్లక్ష్యం: అఖిలేశ్

లక్నో: రక్షణ, భద్రతా దళాల కార్యకలాపాల 'ప్రత్యక్ష ప్రసారాల అనుమతి వ్యూహాత్మక నిర్లక్ష్యం' కాదా అని సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రక్షణ, భద్రతా దళాల కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా నిరోధించాలని కేంద్ర ప్రభుత్వం శనివారం మీడియాకు సూచన చేసింది. అలాంటి సమాచారం తెలిసి లేదా తెలియక శత్రువులకు సహాయపడవచ్చని పేర్కొంది. దీనిపై అఖిలేశ్ ఆదివారం ఎక్స్‌లో స్పందిస్తూ 'భద్రతా కోణం నుంచి ప్రత్యేక కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారానికి అనుమతి వ్యూహాత్మక నిర్లక్ష్యమా లేదా రాజకీయ ప్రచారంతో ప్రేరేపించబడిందా, ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టత ఇవ్వాలి. రేపు మరోసారి ప్రభుత్వం 'ఒక తప్పు తర్వాత ఇది రెండవ తప్పు అని చెబుతుంది' అని పేర్కొన్నారు. 'భద్రత వంటి చాలా సున్నితమైన ప్రాంతంలో మీడియా అవాంఛిత ఆక్రమణలు ఉన్నాయని దీని అర్థం' అని అన్నారు. క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడం కంటే 'ప్రచారానికి' ప్రాధాన్యత ఇస్తోందని కేంద్రంపై మండిపడ్డారు. నిరుద్యోగ సమస్యను లేవనెత్తుతూ తగిన ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్పీ యువజన విభాగం సమావేశం తర్వాత పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ప్రజలకు వారి అర్హతల ప్రకారం పని దొరకడం లేదు. ప్రభుత్వం గౌరవప్రదమైన ఉపాధి కల్పించలేకపోతుంది. డిగ్రీలు ఉన్నవారు, మంచి వృత్తిపరమైన కోర్సులలో డిగ్రీలు ఉన్నవారు డెలివరీ బాయ్‌లుగా మారారు' అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులు కాలరాస్తోందని, రిజర్వేషన్ విధానాలు తుంగలో తొక్కిందని మండిపడ్డారు. విద్యారంగంలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందని ఆయన ఆరోపించారు.

'పహల్గాం' బాధిత కుటుంబాలకు నాగరిక్ శౌర్య అవార్డు ఇవ్వాలి

సీఎం ఫడ్నవీస్‌కు సుప్రియా సూలే లేఖ

పూనే: పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన మహారాష్ట్రకు చెందిన ఆరుగురి కుటుంబాలు చూపిన ధైర్యసాహసాలు ప్రశంసనీయమని ఎన్సీపీ (ఎస్పీ) నేత, బారామతి ఎంపీ సుప్రియా సేలే అన్నారు. తమ వారిని కళ్ల ఎదుటే చంపేస్తున్నా ధైర్యంగా నిలబడిన ఈ కుటుంబాలను కు 'నాగరిక్ శౌర్య' అవార్డుతో సన్మానించాలని కోరుతూ ఆమె ఆదివారం సీఎం ఫడ్నవీస్‌కు ఒక లేఖ రాశారు. మే 1న మహారాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులతో పహల్గాం మృతుల వారసులను గౌరవించాలని సూచించారు. 'ఈ పిరికిపంద చర్యను దేశం ఐక్యంగా ఖండిస్తోంది. భయానక పరిస్థితుల్లో చూపిన సాహసానికిగాను ఈ కుటుంబాలను ప్రశంసించాలి. తమ ఆత్మీయులను కళ్ల ఎదుటే కిరాకతంగా చంపేస్తున్నా వారు ఎంతో ధైర్యంగా ఆ పరిస్థితులను ఎదుర్కొన్నారు. వారి స్ఫూర్తి, ఆత్మధైర్యానికి గౌరవించేలా నాగరిక్ శూర్యతో సన్మానించాలి. అలాగే, మృతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున వారి విద్యా అర్హతల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి' అని లేఖలో సూలే పేర్కొన్నారు. మృతుడు సంతోశ్ జగ్దాలే (పూనే) కుమార్తె ఆశావరి ఉన్నత చదువులు చదివారని, ఆమెకు ప్రభుత్వంలో సరిపడ స్థానం కల్పించాలని ప్రత్యేకంగా సిఫార్సు చేశారు. ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల కష్టకాలంలో పౌరులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందన్న సందేశం ప్రజల్లోకి వెళుతుందన్నారు. తన సూచనను పరిగణనలోకి తీసుకొని సీఎం సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో సుప్రియా సూలే పేర్కొన్నారు. పహల్గాం దాడిలో మహారాష్ట్రకు చెందిన అతుల్ శ్రీకాంత్ మోనే, హేమంత్ సుహాస్ జోషి, సంజయ్ లక్ష్మణ్ లెలే (డోంబివిలి), కౌస్తుబ్ గన్బోటె, సంతోశ్ జగ్దాలే (పూనే), దిల్లీ దసాలే (పన్వేల్-నవీముంబై) ప్రాణాలు కోల్పోయారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మహిళల సమస్యలపై జాతీయ కమిషన్ బహిరంగ విచారణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్- మహిళా జన్ సున్వాయి పేరుతో జాతీయ మహిళా కమిషన్ మహిళల సమస్యలపై వినతులు స్వీకరిస్తుందని ఫిర్యాదులు సమర్పించాలనుకునే మహిళలు తమ వినతులను కమిషన్ కు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు తెలిపారు. మహిళల సమస్యలు, ఫిర్యాదులను సోమవారం(ఏప్రిల్ 28)న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు హైదరాబాద్ బేగంపేట్ టూరిజం ప్లాజాలోని సమాగమం హాల్, 2వ అంతస్తులో జాతీయ మహిళా కమిషన్, న్యూఢిల్లీ, స్వీకరిస్తారని అయన తెలిపారు. మహిళలు తమ ఫిర్యాదులను, వినతులను నేరుగా జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించవచ్చని ఆయన తెలిపారు.

500 మందితో వరంగల్ సభకు తరలి వెళ్లిన కార్పొరేటర్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : అభివృద్ధి, ప్రజా సంక్షేమం బీఆర్ఎస్ పార్టీ అధినేత బాపు కెసిఆర్‌తోనే సాధ్యమని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో ఆదివారం వరంగల్‌లోని ఎలుకతుర్తిలో జరిగే 25 సంవత్సరాల రజితోత్సవ సభకు గౌతంనగర్ డివిజన్ నుండి సుమారు 500 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ముందుగా మిర్జాలగూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మిర్జాలగూడ, మల్కాజిగిరి మీదుగా భారీ ర్యాలీగా వరంగల్ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు, సుమారు 500 మంది భారీగా తరలి వెళ్లారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద పహల్గాం ఉగ్రవాదుల మారణ కాండను నిరసిస్తూ జవహర్ నగర్ కాప్రా మండల సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ మాట్లాడుతూ పహల్గాం టూరిస్టులపై దాడి ఖండిస్తూ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన ఉగ్రవాదులను మతం పేరుతో మారణ హోమం సృష్టిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వారి ఆత్మకు శాంతి కలగాలని ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఉగ్రవాదం పిరికిపంద చర్యని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, మహిళా సమాఖ్య కాప్రా మండల కార్యదర్శి కోదాస్ జయమ్మ ఏఐటీయూసీ కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, సిపిఐ గిరి ప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం సాగర్, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు రాజు నాయక్, సిపిఐ నాయకులు సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని టెలికాం నగర్, ఇజ్జత్ నగర్, ఆదిత్య నగర్ శాఖల మహాసభలు శేర్లింగంపల్లి మండల కార్యాలయంలో ఆదివారం జరిగాయి. ఈ మహాసభలకు రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథులుగా పాల్గొని. మాట్లాడుతూ. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పేదలు ఇప్పటికి ఇల్లు లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు శేర్లింగంపల్లిలో అలుపు ఎరుగని పోరాటాలు చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ శేర్లింగంపల్లి ప్రజలకు మౌలిక వసతులు లేక. ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాటి సాధనకు ఉద్యమిస్తామని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఒక ఉద్యమాల పార్టీగా నిలబెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కే చంద్ యాదవ్, ప్రజానాట్యమండలి జిల్లా సమితి సభ్యులు కే సుధాకర్. కె లక్ష్మమ్మ, మహిళా సమైక్య మండల కార్యదర్శి కే నరసింహారెడ్డి, బిటసి జిల్లా కార్యదర్శి. కే కాసిం, ఎస్ కొండలయ్య, జెట్టి శ్రీనివాస్, ఎం వెంకటేష్, బి నారాయణ, రఘు కృష్ణ, చంద్రమ్మ, ధర్మ తేజ, నితీష్, ఎస్ నరసమ్మ పాల్గొన్నారు.

సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా

శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించాలి

డిఆర్ఎస్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో ఇస్కాన్ గీతా పఠనం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆధునిక యుగంలో పతనమవుతున్న మానవత్వ, నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మనిషిని మనిషిగా జీవింపజేసే సనాతన ధర్మాలు, పురాణాలు, ఇతిహాసాలను, మేధో సంపత్తిని భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా మరింత శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని గవర్నర్ ఉద్బోధించారు. ఇస్కాన్, తెలంగాణ అగర్వాల్ సమాజ్, డిఆర్ఎస్ ఇంటర్ స్కూల్ ఆధ్వర్యంలో హైదరాబాద్, కొంపెల్లిలోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన 'గీతా' పఠనం వేసవి శిక్షణ శిబిరం 2025'ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇస్కాన్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ యుధిష్ఠర్ గోవింద ప్రభు, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్స్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంజని కుమార్ అగర్వాల్, ఇస్కాన్ కుకట్‌పల్లి విభాగం అధ్యక్షులు మహాశ్రింగదాస్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ ప్రపంచంలోని సమస్యలన్నింటికీ భగవద్గీత ఒక్కటే సమాధానమని ఆయన పేర్కొన్నారు. భగవద్గీత శ్లోకాలు మానవ జీవితానికి మార్గదర్శకాలని, వాటిని నిత్యం అభ్యాసం చేయడం ద్వారా సమర్థవంతమైన జీవితాన్ని జీవించగలమన్నారు. నేటి బాలలే భావి భారత పౌరులని, వారికి ఎలాంటి శిక్షణను ఇస్తే అలాగే తయారవుతారని, చిన్నతనం నుంచే పిల్లలకు మానవత్వ, నైతిక విలువలను నేర్పించడం ద్వారా భవిష్యత్ వారు మెరుగైన భారతాన్ని నిర్మించగలరన్నారు. చిన్న వయస్సులో వారు నేర్చుకునే విషయాల ఆధారంగానే వారి జీవన ప్రయాణం కొనసాగుతుందన్నారు. మనిషి జీవించి ఉన్నంత కాలం మంచి విషయాలను అభ్యాసం చేయాల్సిందేనన్నారు. భారతదేశానికి వందలాది ఏళ్ళ ఇతిహాస చరిత్ర ఉందని, ఆధ్యాత్మికంగా ఎలా ఎదగాలో ప్రపంచమంతా భారతదేశాన్ని చూసి నేర్చుకునేలా మన ఆధ్యాత్మిక శిక్షణ ఉండాలన్నారు. ఇస్కాన్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ యుధిష్ఠర్ గోవింద ప్రభు మాట్లాడుతూ ప్రపంచంలో మనిషి ఎంత సంపదను పోగు చేసుకున్నా, ఎంత అభివృద్ధి చెంది విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నప్పటికీ మనశ్శాంతి లేదన్నారు. ప్రజల జీవనంలో పరివర్తన తీసుకురావడం, తద్వారా మానవత్వ, నైతిక విలువలతో కూడిన శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించడమే ఇస్ లక్షమన్నారు. సమస్త సమస్యలకు పరిష్కారం చూపగల భగవద్గీత వల్లనే ఇది సాధ్యమన్నారు. డిఆర్ఎస్ స్కూల్స్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంజని కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రజలను సన్మార్గంలో నడిపించే భగవద్గీత ప్రవచనాలను ఇక పాఠశాలలో నుంచి ప్రతి రోజూ ఉదయం ప్రార్థన సమయంలో బోధించనున్నట్లు ప్రకటించారు. డిఆర్ఎస్ పాఠశాలలో ఇప్పటివరకు దాదాపు 35 వేల మంది పిల్లలు విద్య అభ్యసిస్తున్నారని, వీరందరినీ మానవత్వ, నైతిక విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్షమన్నారు. డిఆర్ఎస్ పాఠశాలలలో విద్యను అభ్యసించిన అనేక మంది ఐఎఎస్ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, పెద్ద వ్యాపారస్తులుగా, వృత్తి నైపుణ్య రంగాల్లో స్థిరపడ్డారన్నారు. ఇస్కాన్ కుకట్‌పల్లి విభాగం అధ్యక్షులు మహాశ్రింగదాస్ మాట్లాడుతూ భగవద్గీత ప్రవచనాల ద్వారా ప్రజలలో వేదసంస్కృతిని, మానసిక ప్రశాంతతను, మనోధైర్యాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు. భగవద్గీత శ్లోకాల పఠనంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులను గవర్నర్ అభినందించి అవార్డులను అందజేశారు. వేసవి శిక్షణ శిబిరానికి వచ్చిన చిన్నారులు పఠించిన భగవద్గీతలోని శ్లోకాలు సభికులను ఆకట్టుకున్నాయి. భగవద్గీత ప్రవచనాలపై చిన్నారులు చేసిన నృత్యాలు సభికులను అలరించాయి.

ప్రజల్లో విప్లవ పోరాటాలను పెంపొందించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, కవులు, కళాకారులు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల, కార్మికుల, మధ్యతరగతి కుటుంబాలలో చైతన్యం తీసుకొచ్చేందుకు కవులు రాసిన పాటలకు బాణీలు సమకూర్చి ప్రజలకు, కార్మికులకు చైతన్యం చేయడంలో ఐక్యంగా పని చేస్తున్నందుకు ఆయన అభినందించారు. సాంస్కృతిక కళల ద్వారా విప్లవానికి మార్గం సులభమైతాదని ఆయన పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా పై మూడు సంఘాల సమన్వయంతో భవిష్యత్తులో కలిసి పని చేయాలని, కొత్త పాటలను, కొత్త కళారూపాలను ప్రచారంలో పెట్టాలని ఆయన కోరారు. అరసం గౌరవాధ్యక్షులు కెవిఎల్ మాట్లాడుతూ ప్రజా కళలను ప్రజల చెంతకు తీసుకువెళ్ళి చైతన్యపరిచి, వారిలో విప్లవ పోరాట మార్గాలను పెంపొందించాలని ఆయన కోరారు. ప్రజా, కార్మిక, రైతు ఎవ్వరి పోరాటాలు జరిగినా అభ్యుదయ రచయితల సంఘం ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, ఆయా సందర్భాల బట్టి పాటలు రాస్తూ, అండదండగా ఉంటున్నామని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరింత ఐక్యతతో ప్రజా ఉద్యమాలు ముమ్మరం చేయడానికి ఆట, పాట, మాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసి కార్మికవర్గ దృక్పథంతో ఐక్యం చేసేందుకు అభ్యుదయ రచయితల సంఘం ముందుంటుందని ఆయన హామీ ఇచ్చారు. అరసం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలను కార్మికులను చైతన్యపరచడంలో ప్రధాన పాత్ర గ్రేటర్ హైదరాబాద్ కవులు, కళాకారులు ప్రధాన పాత్ర పోషిస్తారని ఆయన హామీ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులు ఉన్నచోట కేంద్ర ప్రభుత్వ పోలీసు వైఫల్యం ఉండటం వల్లనే ఉగ్రవాదులు రెచ్చిపోయి అతి కిరాతకంగా 28 మందిని హత్య చేసినా కనీస రక్షణ కల్పించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉన్నదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి సామాన్య ప్రజలకు అండగా నిలబడాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఖమ్మం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ కవుల, కళాకారుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు ఆయన మెచ్చుకున్నారు. ప్రముఖ కళాకారుడు మోహన్‌రావు, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రజానాట్యమండలి, ఎఐటియుసి సహాయ సహకారాలతో రానున్న 6 నెలల్లో 10 జిల్లాల కేంద్రాలలో కవుల, కళాకారుల సమావేశాలను నిర్వహించి ఉమ్మడి కమిటీలను వేసి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను పెంపొందించాలని సమావేశం నిర్ణయించింది. అన్ని జిల్లాల కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కెవిఎల్ కోరారు.

కేసిఆర్ బహిరంగ సభకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గం నుండి చలో వరంగల్ బిఆర్ఎస్ రజతోత్సవ సభకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలి వెళ్ళారు. చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మల్కాజిగిరి నియోజకవర్గ అల్వాల్ సర్కిల్, మల్కాజిగిరి సర్కిల్ డివిజన్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ జెండాలు ఆవిష్కరించి బస్సులు, కారులను జెండా ఊపి భారీ ర్యాలీని ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం మొత్తం కేసీఆర్ బహిరంగ సభ వైపు చూస్తుందని, దేశ రాజకీయాల్లో రజతోత్సవ సభ నిలిచిపోవడం ఖాయమని, కేసీఆర్‌కు తెలంగాణకు పేగు బంధం, చావునోట తల పెట్టి ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కృషి చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. ప్రజలు కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని, కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు జెఎసి వెంకన్న, బద్దం పరశురామ్ రెడ్డి, రాము యాదవ్, జి.కే.హనుమంతరావు, మురుగేశ్, చిన్న యాదవ్, శివ కుమార్, లడ్డు నరేందర్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరంగల్‌కు కదిలిన గులాబీ దండు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: వరంగల్‌కు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ%శీ% నుండి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో వరంగల్ సభకు బారులు తీరారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవల్లో భాగంగా వరంగల్ ఎల్కుర్తిలో నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సుమారు 60 ప్రత్యేక బస్సుల్లో, 310 కార్లలోతో పాటు ఇతర వాహనాలలో గులాబీ శ్రేణులు సభకు వెళ్లారని అన్నారు. ఊహించని స్థాయిలో స్వచ్ఛందంగా పార్టీ అభిమానులు, కెసిఆర్ అభిమానులు సభకు తరలి వెళ్లడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. కేశంపేట, కొందుర్గు, చౌదరి గూడెం, కొత్తూరు, నందిగామ, ఫారుక్ నగర్ మండలాలలోని ప్రతి పల్లె నుంచి కార్యకర్తలు సభకు తరలివచ్చారని, రజతోత్సవ సభ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలిపే విధంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఈనెల 30 వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు గడువు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, ఈబిసి, ఈడబ్ల్యూఎస్ ద్వారా నిరుద్యోగ యువతకు కోసం తెలంగాణ ప్రభుత్వం రాజు యువ వికాసం పథకం ప్రవేశపెట్టిందని జిల్లా షెడ్యూలు కులముల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ రమేష్ తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఆర్థిక సహాయం కోసం హైదరాబాద్ జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 1,28,763 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వీటిలో 50000 మంది మాత్రమే జిహెచ్ఎంసి వార్డు కార్యాలయాలలో తమ దరఖాస్తులను అందించారని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇంకా దరఖాస్తులను సమర్పించని వారు అవసరమైన పత్రాలతో ఏప్రిల్ 30లోగా తమ దరఖాస్తులను జిల్లాలోని జిహెచ్ఎంసి వార్డు కార్యాలయాలలో సమర్పించాలని ఆయన తెలిపారు.

దోచుకున్న డబ్బుతో ఆర్భాటాలా ?

టీపీసీసీ అధికార ప్రతినిధి చెనగాని దయాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అయిన నాటి నుండి కల్వకుంట్ల కుటుంబమే అధ్యక్ష పదవిని చేపట్టారని కావున ఈ సారైన ఆ పార్టీ నాయకత్వం మార్పు జరిగి సామాజిక న్యాయం పాటించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చెనగాని దయాకర్ అన్నారు. రాష్ట ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కల్పిస్తూ కులగణన అమలు చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభలో బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తూ తీర్మానం చేయాలని అయన కోరారు. ఆదివారం గాంధీభవన్‌లో అయన విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ అధ్యక్షుడు దళితుడుని నియమించడంతో పాటు రాష్ట్ర ఆధ్యక్షునిగా బీసీకి అవకాశం ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బీసీలపై బీఆర్ఎస్ ప్రేమ మాటల్లో కాకుండా అచరణలో పెట్టి చూపాలన్నారు. ప్రజల రక్తం సొమ్ముతో బీఆర్ఎస్ పార్టీ అంగు ఆర్బాటలు చేస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పది ఏళ్ళు అధికారంలో ఉండి చేయలేని సంక్షేమ పథకాలు 15 నెలల్లో కాంగ్రెస్ పార్టీ చేసి చూపిందన్నారు. తెలంగాణ రాష్టం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ రాష్టం కేరాఫ్ అడ్రస్ మారిందని తెలిపారు. 25 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీతో తెలంగాణ వాదంతో ఒక్క కుటుంబం మాత్రమే అభివృద్ధి జరిగిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాలకు, యువత నియామకాలకు పునాది పడిరదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక, రాజకీయ సంస్కృతిక, కవులు, కళాకారులకు, ఉద్యమ కారులను గౌరవించుకుందన్నారు.

నానక్ రామ్‌గూడలో స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : దంత వైద్య రంగంలో ఎంతో ప్రసిద్ధి చెందిన స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ తన మూడో బ్రాంచ్‌ను నానక్ రామ్‌గూడలో ప్రారంభించింది. ఈ సందర్భంగా స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా దంత వైద్య రంగంలో సరికొత్త ప్రమాణాలు పాటిస్తూ ఉన్నామన్నారు. నానక్ రామ్ గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మూడో బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలతో పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఇప్పటికే సేవలందిస్తున్నామని చెప్పారు. ఆధునిక వైద్య పద్ధతులపై ఎంతో నిబద్ధతతో ఉన్నామన్నారు. ఇదే స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్‌ను అగ్రపథంలో నిలిపిందన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యుత్తమ సాంకేతికతను కలిగి ఉన్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్ధారణ పద్ధతులు అత్యంత కచ్చితత్వాన్ని అందిస్తాయని తెలిపారు. సీఈఆర్ఈసీ సిస్టమ్ ద్వారా అదే రోజు క్రౌన్‌లను ఏర్పాటు చేయవచ్చన్నారు. లేజర్ డెంటిస్ట్రీ తక్కువ నొప్పితో, స్వల్ప శస్త్రచికిత్సకు మార్గం సుగమం చేస్తుందన్నారు. మా గ్రూప్‌లోని మూడు హాస్పిటల్స్‌లో 50 పైగా ఆధునిక దంత చెయిర్స్ ఉన్నాయన్నారు. అత్యంత అనుభవం గల 40 మంది నిపుణులు ప్రతి రోజూ 200 పైగా రోగులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. మా ప్రత్యేకత ఏమిటంటే.. ప్రతి రోగికి అత్యుత్తమ చికిత్స అందించేందుకు నిపుణుల బృందం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇది అత్యుత్తమ చికిత్స విధానం అన్నారు. ఇది అంతర్జాతీయంగా ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. అమెరికాలోని అనేక డెంటల్ క్లినిక్‌లు నిత్యం స్మైలైన్ నిపుణులతో టెలీ కన్సల్టేషన్ ద్వారా సలహాలు తీసుకోవడం.. మేము పాటిస్తున్న ప్రపంచస్థాయి ప్రమాణాలకు, విశ్వాసానికి నిదర్శనమన్నారు.

దేశ ప్రజలను కలిచివేసిన జమ్మూ ఉగ్రదాడి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని హిందూ ముస్లిం వివాదంగా చిత్రించే కుట్రలో భాగమే అని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.డి.పాషామియా స్పష్టం చేశారు. చెన్నాపురం, దేవేందర్ నగర్, ఆదివారం జమ్మూకాశ్మీర్ లో ఉగ్ర దాడికి గురై మరణించిన వారి స్మృతిలో బాగంగా ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం టి.కాలేషా అధ్యక్షతన జరిగింది.దేశ ప్రజలను కలిచివేసే ఇలాంటి చర్యలను మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాల్సిన ఘటనగా చూడాలని మహ్మద్ పాషామియా విజ్ఞప్తి చేశారు.ఉన్మాద భరితమైన ఈపైశాచిక దాడిలో 28 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపి, మరో ఇరవై మంది తీవ్రంగా గాయపడడానికి కారణమైన లష్కరే ఏ తోయిబా అనుబంధం అయిన రెసిస్టేన్స్ ఫ్రంట్ తీవ్రవాద సంస్థ జరిపిన అమానుష, దుర్మార్గమైన కాల్పులను మధ్య భారతదేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో తమ నివాస ప్రాంతాల నుండి బలవంతం గా వెళ్ళగొట్టేందుకు గత పదిహేను నెలలుగా కేంద్ర మిలటరీ బలగాలు ఆదివాసి ప్రజలపై చేపడుతున్న అమానీ యమైన హత్యకాండను కూడ ముస్లిం కమిటీ ఖండిస్తుందని అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి జీవించే హక్కును కల్పించిందని, దానిని కాలరాచే హక్కు ఎవరికి లేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉగ్ర కాల్పులను సహితం లెక్కచేయకుండా పర్యాటకులను కాపాడే క్రమంలో అదాల్ హుసేన్ తన ప్రాణాలనే బలిచేశాడని, ఇదే మనిషిని మనిషిగా గుర్తించే మానవత్వం అని పేర్కొన్నారు. ఇలాంటి మానవత్వ స్ఫూర్తితోనే కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలందరు ఉగ్ర భూతానికి వ్యతిరేకంగా సంఘటితం గా పోరాడాలని పిలుపునిచ్చారు. వివిధ రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు సిపిఎం నగేష్, శివన్నారాయణ, వెంకటాద్రి, ఇష్టా షేక్ షావలి, బడిగే వెంకటేష్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్ కుమార్, భహుజన సత్త బండకింది సింగరయ్య గౌడ్, పిఓడబ్ల్యు(విముక్తి) పి.సునీత, చైతన్య మహిళాసంఘం అల్లూరి సావిత్రి, కవి, రచయిత ఎస్.కె.మీరా, రిపోర్ట్ కొన్నె వేణు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, బహుజన రక్షణ సమితి జావేద్, టివిఐవి మబ్బుబాలు, కమిటీ సభ్యులు సైయద్, వహీద్, అనీఫ్, జమాల్, ముర్తుజా, అజ్మాతుల్, మహ్మద్ శోహెల్, షేక్ షరీఫ్, యూసూఫ్, పుల్లీబీ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ జమ్మూ ఉగ్ర దాడిని నిరసిస్తూ ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమం అనంతరం తెలంగాణలో జరిగే 72 వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలనే కరపత్రాలను చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి అధ్యక్షతన ఆవిష్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని చౌదర్ గుడెం, కొందుర్గ్, ఫరూఖ్ నగర్, కొత్తూర్, నందిగామ, కేశం పెట్ మండలంతో పాటు షాద్‌నగర్ పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 13.37,500 పదమూడు లక్షల ముప్పై ఏడూ వేలు 500 విలువ గల సిమ్ఆర్ఎఫ్ చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఫిలిం బోర్డు సభ్యుని పరామర్శించిన ఎంపీ

విశాలాంధ్ర - అమనగల్లు : ఫిలిం బోర్డు మాజీ సభ్యుడు, ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు తిప్పిరెడ్డి రాంరెడ్డిని ఆదివారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి పరామర్శించారు. హార్ట్ ఎటాక్ కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వారు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆదివారం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వరంగల్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: వరంగల్ సభతో అధికార కాంగ్రెస్ వెన్నులో వణుకు పుట్టాలని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. స్వరాష్ట్ర సాధనతోనే అభివృద్ధి - ప్రజా సంక్షేమం సాధ్యమని నమ్మి 2001 సంవత్సరంలో ప్రారంభమైన బిఆర్ఎస్ ప్రస్థానం నేటితో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఎల్కతుర్తి నందు తెలంగాణ జాతిపిత, పెద్దలు కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఛలో వరంగల్" సభకు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఉదయం 8 గంటల నుండి కృషి కాలనీ, శ్రీను బస్తీ, జై సంతోష్ నగర్ వివిధ కాలనీలలో హేమలత సురేష్ రెడ్డి బిఆర్ఎస్ జెండాలను ఆవిష్కరణ చేసి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ సంఖ్యలో బస్సులలో సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ నాయకులు, సంక్షేమ సంఘ అధ్యక్షులు, మన్నే రాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి, శివాజీ, విజయ్, జహంగీర్, సంఘమెష్, పకిరా, సంతోష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్

విశాలాంధ్ర- దుండిగల్: ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్, ఇందిరమ్మ కాలనీ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రజతోత్సవ వేడుకలు పురస్కరించుకుని బిఆర్ఎస్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధనకై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ ని స్థాపించి అనేక ఆటుపోట్లకు గురై, అనిర్విరామంగా కృషి చేసి, ఎన్నో పోరాటాలను నడిపించి తెలంగాణ ను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు.తెలంగాణను 10 సంవత్సరాలు అభివృద్ధి పథంలో నడిపి, అనేకా అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు.ఏ ప్రాంతీయ పార్టీకి లేని అత్యధిక కార్యకర్తల సంఖ్యా బలం కలిగిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభను తరలిన నేతలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : వరంగల్‌లో జరిగిన, 25 వసంతాల పండగకు ముషీరాబాద్ నుంచి వెళ్లిన నగేష్ ముదిరాజ్, టిఆర్ఎస్ కార్యకర్తలు. ఈ సందర్భంగా నాగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ, తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీ, తెలంగాణను సాధించిన పార్టీ, పదేండ్లు తెలంగాణను అభివృద్ధి చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణే జెండాగా తెలంగాణే ఎజెండాగా నిలిచి, గెలిచిన పార్టీ మన బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పల్లె పల్లెనా, గుబాళించిన గులాబీ జెండాలే. ప్రతి దారి గులాబీ మయమై వరంగల్ పయనమే, తెలంగాణ అంతటా ఇంటి పండుగ సంబరాలు, కనీవినీ ఎరగని రీతిలో కదులుతున్న గులాబీ దళాలు. 25 వసంతాల బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాన్ని చరిత్ర చెప్పుకునేలా విజయవంతం చేయబోతున్న తెలంగాణ ప్రజానీకనికి వందనాలు తెలిపారు. నాగేష్ ముదిరాజ్ బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు.

ఘనంగా దాసరి నాగభూషణరావు వర్ధంతి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు దాసరి నాగభూషణరావు 17వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఆయనకు నివాళులు అర్పించారు. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ వి.చెన్నకేశవరావు దాసరి నాగభూషణరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దాసరి నాగభూషణరావు తుది శ్వాస వరకు ప్రజా అభ్యున్నతికి, సిఆర్ ఫౌండేషన్ స్థాపనకు చేసిన కృషిని, ఆయన త్యాగనిరతిని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు యన్.రాజేంద్రరావు, డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్యా, సీనియర్ పాత్రికేయులు ఏబికె ప్రసాద్, డాక్టర్ పి. సరస్వతి, మల్లంపాటి వెంకటేశ్వరరావు, ఇందుకూరి ఝాన్సీ, వెలువోలు సాంబశివరావు, హెూమ్ మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం టికెట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని పార్టీలు బీసీలకు 42 శాతం టికెట్ కేటాయించాలనీ జాతీయ అఖిలభారత బీసీ సంఘటన సమితి" జాతీయ అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహబూబ్ నగర్ మేయర్ సీటును బీసీ మహిళకు రిజర్వ్ చేయాలన్నారు. పరస్పర సహకారంతో బీసీలు అభివృద్ధి సాధించాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం సమగ్రాభివృద్ధి అనే అంశంపై నేడు తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో బీసీ ప్రముఖుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షులు కుమ్మరి రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెట్టుకాడి శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ కుల సంఘాలు పరస్పర సహకారంతో మన ఓటు మనకే అనే నినాదంతో ఓట్లు చీల్చకుండా బీసీలకే వేసుకోవాలనీ కోరారు. రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే (విశ్వకర్మ రాజు యువశక్తి ముద్ర వంటి) సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని బీసీ కుల సంఘాలకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చే సబ్సిడీ రుణాలలో బ్యాంకులోను ముడిపెట్టి సివిల్ రేట్ అనే మెలికే పెట్టకుండా ఎలాంటి గ్యారెంటీ లేకుండా రుణాలు ఇచ్చి బీసీల సాధికారతకు జీవనోపాధి దోహదపడాలని కోరారు. బీసీలు అంకితభావంతో సమకాలీన రాజకీయాలను గమనిస్తూ మన ఓటు మనకు ఎన్ని నినాదంతో అనే నినాదంతో పోటీ చేయకుండా బీసీలకే వేసి రాజ్యాధికారం పొందాలని కోరారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే జనరల్ ఎలక్షన్లో చట్టసభల్లో బీసీల రాజ్యాధికారానికి పునాది అవుతుందని తెలిపారు. ఆచార్య జయశంకర్, విశ్వకర్మ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి బ్రహ్మయ్య చారి, ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి చంచల రవికుమార్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాజి, రామ్ శ్రీనివాస్, సీనియర్ కౌన్సిలర్ అచ్చు గట్ల అంజయ్య, లక్ష్మీనారాయణ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు పురుషోత్తం పద్మశాలి అధ్యక్షులు సారంగి లక్ష్మీకాంత్, మంజుల ఉమా మాధవి, రమాదేవి పుష్ప రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

విశాలాంధ్ర - దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని బిజెపి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల సీనియర్ నాయకులతో కలిసి బిజెపి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన గండిమైసమ్మ ఆదిత్యబ్రహ్మ వర్క్ షాప్ నందు నిర్వహించిన కార్యకర్తల సమావేశ కార్యక్రమానికి ఇంచార్జిగా దండుగుల వెంకటేష్‌తో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యాంరావ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికారమే ధ్యేయంగా ప్రజా సమస్యలపై అందరి సహకారంతో సకాలంలో స్పందించి పోరాడే సరైన బృందం ఏర్పాటు చేసుకుని ముందుకు కొనసాగాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ బిజెపి పార్టీ పూర్తి స్థాయి కమిటీ వివిధ బాధ్యతలు ఆశావహుళ పేర్లు అందరి సమక్షంలో సేకరించి రాష్ట్ర పార్టీకి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి శ్రీశైలం యాదవ్, మున్సిపల్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, ఆకుల మల్లేష్,మాజీ ఉపాధ్యక్షులు పిట్ల లక్ష్మణ్, మాజీ జీఎస్‌లు శ్రీనివాస్ యాదవ్, ఆర్ నర్సింహా చారి, భాను గౌడ్, అతీష్ బాబు, ఎస్టీ మోర్చా నాయకులు వెంకటేష్ నాయక్, శ్రీను నాయక్, ఎన్ రోజా, నవీన్ కుమార్, చిన్నా, రాజ్ కుమార్, శ్రీధర్ గౌడ్, క్యాసారం రాజు, గణేష్ పాల్గొన్నారు.

పేరెంట్ పెట్ ఫుడ్‌ను విడుదల చేసిన న్యూట్రిషన్ నెక్స్‌ట్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : పెంపుడు జంతువుల సంరక్షణ కోసం సమగ్ర పరిష్కారాలను అందించే స్టార్టప్ అయిన న్యూట్రిషన్ నెక్స్ట్ పెంపుడు జంతువులకు వాటి వయసుకు తగ్గ నిర్దిష్టమైన ఆరోగ్యకరమైన పోషణను అందించే పేరెంట్ పెంపుడు జంతువుల ఆహారాన్ని విడుదల చేసినట్లు వెల్లడించింది. పెంపుడు జంతువుల పోషణ, ఆరోగ్యం మరియు సంరక్షణను ముందుకు తీసుకెళ్లడంలో ఒక ముఖ్యమైన ముందడుగును ఈ ఆవిష్కరణ సూచిస్తుంది, భారతదేశంలో పెరుగుతున్న పెంపుడు జంతువుల సంరక్షణ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి న్యూట్రిషన్ నెక్స్‌ట్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ సందర్భంగా న్యూట్రిషన్ నెక్స్‌ట్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ శ్రీ ప్రహర్ష చెరుకూరి మాట్లాడుతూ పెంపుడు జంతువులు ఆరోగ్యంగా, సంతోషంగా మరియు ఎక్కువ కాలం జీవించేలా ప్రపంచాన్ని తీర్చిదిద్దడమే మా లక్ష్యం. భారతదేశంలో, వివిధ జీవిత దశలలో పెంపుడు జంతువులకు నిర్దిష్ట పోషక అవసరాలను అందిస్తూ పెంపుడు జంతువులను లక్ష్యంగా చేసుకుని ఆహారాన్ని అందించడానికి రూపొందించిన ఉత్పత్తుల కొరత ఉందన్నారు.

సహ వ్యవస్థాపకుడు మరియు చీఫ్ మెంటర్ అయిన డాక్టర్ వెంకట ధర్మేంద్ర బొప్పన, వెటర్నరీ సైన్స్‌లో పీహెచ్‌డీ, వెటర్నరీ ఇమ్యునాలజీ, ఇన్ఫెక్షియస్ డిసీజెస్పై పరిశోధనలు చేయటం ద్వారా 25 సంవత్సరాల విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. ప్రస్తుతం అమెరికాలో యానిమల్ హాస్పిటల్స్ చైన్ ను నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "పెంపుడు జంతువులను తమ వద్ద ఉంచుకోవడంతో పాటుగా వాటిని కుటుంబ సభ్యులుగా చూసుకోవడం పెరుగుతున్న ధోరణి ఎక్కువగా కనిపిస్తోందన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : జమ్ము కాశ్మీర్‌లోని పహెల్గాం వద్ద జరిగిన పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన మృతవీరులకు నివాళులర్పించుటకు మౌలాలిలోని జవహర్ నగర్ నుండి క్యాండిల్ లైట్ ర్యాలీ ప్రారంభమై కాలనీ కమ్యూనిటీ హాల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో హిందూ, ముస్లిం అనే బేధాభిప్రాయాలు లేకుండా ప్రజలు పాల్గొని భారత దేశ ఐక్యతను చాటుకున్నారు. ర్యాలీలో హమ్ పూర ఏకే హై, హిందూ ముస్లిం భాయి భాయి, పాకిస్తాన్ డౌన్ డౌన్ అని టెర్రరిస్టల అరాచకాన్ని ఖండిస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉమేష్ సింగ్, కాలనీ అధ్యక్షులు నారాయణ, జాన్, నరసింహ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, ముత్యం రెడ్డి, సోమా రాములు, వెంకటప్పయ్య, మల్లేష్ గౌడ్, కొండయ్య, శ్రీశైలం, అన్నపూర్ణ, అంజుబాయ్, లక్ష్మి, నర్సమ్మ, మాధవి, పద్మావతి, పద్మా, శ్రీలత పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

మన్‌కి బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ శివరామ్ పల్లిలోని ప్రజా భవన్‌లో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ప్రెసిడెంట్ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాన్‌కి బాత్ 121వ ఎపిసోడ్ ను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ భూపాల్ గౌడ్ రాజేంద్ర నగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ మైలారదేవపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తల తో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ప్రభాకర్ కొమురయ్య అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ బొక్కబాల్ రెడ్డి విజయ్ కుమార్ కాదెం సుధాకర్ జోగిరవి రాచూరి రాజశేఖర్ సోల్కర్ రెడ్డి కొరని సదానంద్ ఎన్ జగన్ సత్యనారాయణ బాబురావు అడికె జనార్ధన్ సులిగె వెంకటేష్ కిరణ్ చారి నాగేష్ యాదవ్ హరికిషన్ రవి కాంత్ రెడ్డి ఎస్ విటల్ బండారి బాలకృష్ణ బిక్షపతి యాదవ్ సందీప్ ముదిరాజ్ కొరని క్రాంతి రాహుల్ రెడ్డి రావుల భాస్కర్ మురళీధర్ రెడ్డి మన్మోహన్ రెడ్డి కోవాకుల బాబు రాకేష్ గౌడ్ పద్మావతి ఉమా అల్లాల అనురాధ ఎడ్లకాడి రవి పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పాలకులు కృషి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఉప్పల్ మండల కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి పి.రామ్ నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76సంవత్సరాలు గడుస్తున్నా నేటికి దేశంలో ఆర్థిక అసమానతలు ఉన్నాయని, పేదవాడు మరింత పేదవాడుగా సంపన్నుడు మరింత సంపన్నుడుగా మారుతున్నారన్నారు. దేశంలో ఉన్న పౌరులందరికీ ఆహారం, దుస్తులు, ఇల్లు ముఖ్యమైనవని కానీ దేశంలో ఎంతమందికి ఇవన్నీ ఉన్నాయో దేశ, రాష్ట్ర పాలకులు స్పష్టం చేయగలరా అని వారు ప్రశ్నించారు...? దేశం అభివృద్ధి చెందడమంటే ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమేనని వారు ఉద్ఘాటించారు. అదే విధముగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా నేడు దేశంలో విభజన రాజకీయాలు జరుగుతున్నాయని, శత్రు దేశం పాకిస్థాన్ భారత పౌరులపై అమానుషంగా వ్యవహరించడం సహించరానిదన్నారు. ఈ సమయంలో దేశ ప్రజలంతా ఐక్యమత్యంగా వుండాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం అధ్యయనం ద్వారా పోరాటాలు నిర్వహిస్తున్నదని వారు అన్నారు. ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి కె.ధర్మేంద్ర, కార్యవర్గ సభ్యులు బషీర్, రాజేందర్, భిక్షపతి, టి. సత్య ప్రసాద్, కృపాకర్, జాన్, సభ్యులు ఎండీ. అక్బర్, జంగారెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, సతీష్ కుమార్, అజీమ్ పాషా, సమీర్, రజిని, విజయ పాల్గొన్నారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్‌లో 60వ వార్షిక సమావేశం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ రైస్ డైమండ్ జూబ్లీ 60వ వార్షిక వరి పరిశోధన గ్రూప్ సమావేశాన్ని రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్లో నిర్వహించారు. ప్రధానంగా వరి పరిశోధన సమన్వయ విభాగం వారిపై ఆలిండియా కో-ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్టు కింద వార్షిక సమూహ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేర్ మాజీ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్, ఐసిఏఆర్ బిజీ పరోడా హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవస్థీకృత వరి పరిశోధన కోసం 1928లో నిజాం పాలనలో ప్రారంభించడం జరిగిందన్నారు. హిమాయత్ సాగర్ డ్యాం నిర్మాణం వల్ల రైతులు వరి సాగు చేపట్టారని గుర్తు చేశారు. నేడు తెలంగాణ దేశంలోనే మిగులు బియ్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా మారిందన్నారు.

యాత్రికులపై ఉగ్రవాద దాడి అమానుషం

విశాలాంధ్ర - కాప్రా : జమ్ము కాశ్మీర్ పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదముష్కర్ల దాడి రాక్షస చర్య అని ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పహల్గాంలో యాత్రికులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల రాక్షస చర్యను నిరసిస్తూ మృతులకు నివాళి అర్పిస్తూ ఆదివారం ఉదయం ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది పైనే సభ్యులు ఈసీఐఎల్ గ్రౌండ్ నుంచి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ మీదుగా ఈసీఐఎల్ బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొన్నారు. మృతులకు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత కాప్రా సర్కిల్ కార్యాలయంకు చేరుకొని ఉగ్రవాదంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపాలంటూ జాతిపిత మహాత్మాగాంధీకి వినతిపత్రం సమర్పించారు. సమతా ర్యాలీ సాగిన దారి పొడవున పెద్దలు మహిళలు ముఖ్యంగా చిన్నారులు ఒక చేత్తో జాతీయ జెండా మరో చేత్తో ప్లకార్డులను చేత పట్టుకొని వత్తుకున్నాం కంటిలో తడిని ఎత్తుకుంటాం భారత్ జెండాను, కరో కరో సంఘర్ష్ కరో హమ్ తుమారా సాథ్, ఉగ్రవాదం నశించాలి, భారత్ మాతాకీ జై అంటూ దిక్కులు పిక్కటిల్లెల నినదించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు, ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ సభ్యులు చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచి బీసీ ఉద్యమం ప్రారంభం అవుతుందన్ని 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధన సమితి నాయకులు అన్నారు. ఆదివారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధన సమితి నాయకులు బీసీ కులాల సంఘ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగాలుగా బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్, శివార్చక విజయ్ కుమార్, మల్లిఖార్జున్, శివ శంకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా కేంద్రాలలో నిరహర దీక్షలు చేపడతామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలాగా 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ కులాలతో సమ్మెలు, రీలే నిరహార దీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామన్నారు. అనంతరం కొల్లాపూర్ తాలూకా తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 25వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 3వ డివిజన్, 14వ డివిజన్‌లలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం పార్టీ జెండాను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆదివారం ఉదయం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, పార్టీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వరద ముప్పు

న్యూదిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వరదల ముప్పు పొంచి ఉంది. ఈ మేరకు స్థానికంగా హెచ్చరికలు జారీ అయ్యాయి. భారత్ వైపు నుంచి నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో మెరుపు వరదలు సంభవించవచ్చని వార్తాలొచ్చాయి. పహల్గాం ఉగ్రదాడిపై చర్యల్లో భాగంగా సింధూ జల సంధిని రద్దు చేసిన క్రమంలో భారత్... దిగువకు నీటిని విడుదల చేసింది. దీంతో పీఓకేలోని ముజఫరాబాద్ సమీపంలో రీఖలం నదిలో నీటిమట్టం కొన్ని అడుగుల మేర పెరిగిందని అధికారులు తెలిపారు. హట్టియాన్ బాలాలో ఎమర్జెన్సీ ప్రకటించారు. నదీ తీరానికి వెళ్లొద్దని ప్రజలను హెచ్చరించారు. ఈ నది అనంతనాగ్ జిల్లా మీదుగా చకోథి ప్రాంతంలో పీవోకేలోకి ప్రవహిస్తుంది. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు ఇవ్వడం లేదని తమకు నమ్మకం కుదిరేంత వరకు సింధూ జల సంధిని రద్దు చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. భారత్ రిజర్వాయర్లలో పేరుకున్న బురదను తొలగించేందుకు దిగువకు నీటి విడుదల చేయకుండా ఈ ఒప్పందం ఆపుతుంది. ఇప్పుడు సింధూ ఒప్పందం రద్దు కావడంతో ఎప్పుడైనా దిగువకు నీరు విడుదల చేసి, కొత్త నీటిని నింపుకొనే అవకాశం భారత్‌కు ఉంది.

ఉగ్రవాదాన్ని కశ్మీర్ సహించదు

శ్రీనగర్‌లో వర్తకులు, విద్యార్థుల ఆందోళన

పహల్గాం దాడికి ఖండన

శ్రీనగర్: ఉగ్రవాదాన్ని కశ్మీర్ సహించదని, ఏ రూపంలోనూ హింసను ఆమోదించదని జమ్మూకశ్మీర్ వర్తకులు, విద్యార్థులు, ఎన్‌జీవోల ప్రతినిధులు వక్కాణించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. కశ్మీర్ లోయ ఉగ్రవాదాన్ని సహించదన్న బలమైన సందేశం ఇవ్వాలనే ఆందోళనకు దిగినట్లు తెలిపారు. పహల్గాం ఘటనకు నిరసనగా శ్రీనగర్‌లోని ఘంటా ఘర్, లాల్ చౌక్ వద్ద వర్తకులు, విద్యార్థులు, ఎన్‌జీవోలు ఆందోళనలు నిర్వహించారు. 'ఇది మా కశ్మీర్. ఇక్కడ ఉగ్రవాదానికి స్థానం లేదు. ఉగ్రవాదాన్ని తిప్పికొడుతూ పర్యాటకులను ఆహ్వానిస్తున్నాం' అని ఆందోళనకారులు అన్నారు. 'పోరు ఉగ్రవాదంపై... అమాయకులపై కాదు' అన్న ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. పర్యాటకాన్ని ఆపేసి కశ్మీర్‌ను నాశనం చేయడమే ఉగ్రవాదుల ఉద్దేశమని మండిపడ్డారు. ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకు ఉందని అన్నారు. 'ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో మాట్లాడుతూ బాధితులకు పరిహారం ఇస్తామని, ప్రతీకారం తీర్చుకుంటామని చెప్పారు. అలా జరగాలని కోరుకుంటున్నాం' అని వారన్నారు. 'ఇది మా కశ్మీరం. పర్యాటకాన్ని పెంపొందించుకుంటాం' అని ఉద్ఘాటించారు. ఉగ్రదాడి జరిగిన తర్వాత పహల్గాంలో పర్యాటకుల తాకిడి తగ్గింది. నిత్యం 5వేల నుంచి 7వేల మంది సందర్శకులు ఉండే స్థాయి నుంచి రోజుకు 50-100 మంది పర్యాటకులు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. దీంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కొంత గడువివ్వండి

ఈడీకి మహేశ్‌బాబు విజ్ఞప్తి

హైదరాబాద్: సాయి సూర్య, సురానా కేసుకు సంబంధించి ఈడీ అధికారులు ఇచ్చిన నోటీసుకు సూపర్‌స్టార్ మహేశ్‌బాబు స్పందించారు. ఈ నెల 28వ తేదీన తమ ఎదుట హాజరు కావాలన్న ఈడీ నోటీసులకు మహేశ్‌బాబు స్పందిస్తూ ఈడీ అధికారులకు ఓ విజ్ఞప్తి చేశారు. సినిమా షూటింగ్ కారణంగా తాను రేపు(సోమవారం) విచారణకు హాజరు కాలేనని స్పష్టం చేశారు. మరో తేదీ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఈడీ అధికారులకు మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. మహేశ్‌బాబు విజ్ఞప్తిని ఈడీ అధికారులు పరిగణనలోకి తీసుకుని సమయం ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. కేసు వివరాలను పరిశీలిస్తే... వివిధ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన కేసులో రియల్‌ఎస్టేట్ సంస్థ సురానా గ్రూప్, దాని అనుబంధ సంస్థలు- సాయిసూర్య డెవలపర్స్, ఆర్యవన్ ఎనర్జీలపై చెన్నైవిభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహించారు. సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో పాటు ఇండస్ట్రీస్ ఎండీ నరేంద్ర ఇంట్లో కూడా సోదాలు చేశారు. భారీగా నగదు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సురానా గ్రూపు పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. సురానా అనుబంధ కంపెనీ సాయి సూర్య డెవలపర్స్ సతీశ్ ఇంట్లో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రమోషన్స్ కింద సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్, సాయిసూర్య డెవలపర్స్ కంపెనీల నుండి మహేశ్‌బాబు పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.3.4 కోట్ల నగదు, రూ.2.5 కోట్లు ఆర్‌టీజీఎస్ ద్వారా... మొత్తం రూ.5.9 కోట్లు తీసుకున్నారని ఈడీ అధికారులు గుర్తించారు. దీంతో మహేశ్‌కు ఈడీ అధికారులు నోటీసులు పంపారు.

ఉరుములు... మెరుపులతో వర్షం

కర్నూలు జిల్లాలో పిడుగుపడి ఇద్దరు విద్యార్థుల మృతి

తడిసిన ధాన్యంతో రైతుల వెతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లాలో పిడుగు పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఇక ధాన్యం తడిచిపోయి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రానున్న మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు పడతాయని, అనేక జిల్లాల్లో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కౌతాళం మండలం నదిచాగి, మేలగనూరు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో మోకాళ్ల లోతులో వర్షపు నీరు నిలిచింది. కళ్లాలో ఆరబోసిన వరి ధాన్యం నీట మునిగింది. ఆయా గ్రామాలకు చెందిన రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కౌతాళం మండలం కాత్రికిలో ఆదివారం క్రికెట్ ఆడుతున్న ఇద్దరు విద్యార్థులు పిడుగు పడి మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. విద్యార్థుల మృతదేహాలను ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పిడుగులు పడే సమయంలో చెట్లకు దూరంగా ప్రజలు ఉండాలని, మూగ జీవాలను అక్కడ లేకుండా చూడాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మహారాష్ట్ర దక్షిణ ప్రాంతాల నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రస్తుతం తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించనుందని వాతావరణ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. దీని ప్రభావంతో బలమైన ఈదురు గాలులు సైతం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపింది.

సచివాలయాలకు గ్రామ ఉద్యాన సహాయకులు

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): గ్రామ ఉద్యాన సహాయకులను సచివాలయాల్లో పనిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జాబ్ చార్ట్ ప్రకారమే గ్రామ ఉద్యాన సహాయకులు విధులు నిర్వహించేలా చూడాలని కోరుతూ గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సదస్సు జరిగింది. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ ఉద్యాన సహాయకులను ఉద్యాన పంటల విస్తీర్ణం ప్రాతిపదికన ఉద్యాన అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహించేలా మ్యాపింగ్ చేయాలని, ఆరేళ్లుగా ఉద్యాన సహాయకులకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చాలామంది ఉద్యోగులు డిప్లొమా, జనరల్ డిగ్రీ, బీఎస్సీ హార్టికల్చర్, ఎమ్మెస్సీ హార్టికల్చర్ చదువుకున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణోతు నాగరాజు మాట్లాడుతూ పదోన్నతుల కోసం గ్రామ ఉద్యాన సహాయకులు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు గతంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన రాలేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమ కార్యాచరణ తప్పదని హెచ్చరించారు. సంఘం నాయకులు సురేంద్ర, మురళీ, చంద్రయ్య, ఆంజనేయులు, దుర్గా ప్రసాద్, సుబ్రమణ్యం, దీక్ష, షమీమ్, భరత్, మనోజ్ పాల్గొన్నారు.

మహనీయులు లేకుండా తెలుగుజాతి ప్రస్తావన?

'పాడుదుమా స్వేచ్ఛాగీతం' పుస్తకావిష్కరణలో వక్తలు

విశాలాంధ్ర-విజయనగరం: గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గిడుగు రామూర్తి వంటి మహనీయులు లేకుండా తెలుగుజాతి ప్రస్తావన చేయడం అత్యంత దారుణమైన విషయమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, రచయిత తెలకపల్లి రవి అన్నారు. విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ హాలులో ఆదివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు రాసిన 'పాడుదుమా స్వేచ్ఛాగీతం' పాటల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సాహితీ ప్రవంతి అధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ రచయిత, కవి అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలకపల్లి రవితో పాటు జడ్పీ చైర్‌పర్సన్ చిన్నశ్రీను, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, కవి డా. డి.వి.జి.శంకరరావు హాజరయ్యారు. తొలుత పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ చిన్నశ్రీను మాట్లాడుతూ విజయనగరం కళలకు పుట్టినిల్లు అన్నారు. ఎందరో మహనీయులు నడియాడిన నేల అన్నారు. సాహిత్యాన్ని, కళలను రేపటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని తెలిపారు. జిల్లా పరిషత్‌లో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

తెలకపల్లి రవి మాట్లాడుతూ ప్రముఖుల వర్ధంతులు, జయంతుల జాబితా నుంచి గురజాడను తొలగించడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. రాజకీయ నేతలు తలుచుకుంటే ఎకరాలు రూపాయికే వస్తాయని, తలుచుకోకపోతే గురజాడ పేరును మరచిపోవచ్చని ఎద్దేవా చేశారు. సనాతనత్వం రాజ్యమేలుతున్న కాలంలో సనాతనత్వాన్ని ప్రశ్నించిన కారణాన గురజాడ పేరు జాబితాలో లేదని సందేహం కలుగుతోందన్నారు. మొల్ల తరువాత ఒక్క ఆధునిక మహిళ పేరు కూడా జాబితాలో లేకపోవడం విచారకరమన్నారు. గంటేడ గౌరినాయుడు గానాల గౌరినాయుడు అని కొనియాడారు. డా. డి.వి.జి.శంకరరావు మాట్లాడుతూ గంటేడ రాసిన పాటలు నేడు విద్యార్థి లోకం నోట వినిపిస్తున్నాయని, తెలుగునాట బహుళ ప్రచారంలో ఉన్నాయని తెలిపారు. ఎన్నో మంచి పుస్తకాలను ఆయన రచించారని అభినందించారు. సాహితీ ప్రవంతి నిర్వాహకులు చీకటి దివాకర్, చంద్రికారాణి అధ్వర్యంలో వారి కుమారుడు రవితేజ, కోడలు వైష్ణవి మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వయోలిన్ విద్వాంసులు ద్వారం గుర్గా ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, ప్రముఖ వైద్యులు డాక్టర్ గేదెల సన్యాసమ్మ, అనేక మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

చేపల ఎగుమతిలో మనమే టాప్: మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకోవడమే లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చేపలవేట నిషేధ సయమంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ నెరవేర్చారన్నారు. గతంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించే వారన్నారు. గత ఎన్నికల ముందు చేపల వేట నిషేధ సయమంలో ఇచ్చే ఆర్థిక సాయం రెట్టింపు చేసి అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. హామీకి కట్టుబడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.259 కోట్లు అందజేసినట్టు చెప్పారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అంటూ రూ.300 కోట్లు ఖర్చు చేసినా ఒక్క మత్స్యకారుని కుటుంబానికి మేలు జరగలేదన్నారు. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందు వరుసలో ఉందని మంత్రి వెల్లడించారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఏపీదే అన్నారు. ఎగుమతుల్లో 32 శాతం జరుగుతోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయొద్దు: రఘునాథరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు: సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయొద్దని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. నూతన విద్యా విధానం అమలు కోసమంటూ గత ప్రభుత్వం అనాలోచితంగా 117 జీవో తీసుకొచ్చిందని, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవో వల్ల నెలకొన్న గందరగోళ పరిస్థితులను విద్యాశాఖ పరిష్కరించాలని, లేకపోతే బడులు నిర్వీర్యమవుతాయని ఆయన హెచ్చరించారు. సీపీఐ ఒంగోలు కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు యర్రయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో రఘునాథరెడ్డి మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సంవత్సరన్నర కాలంగా అర్ధ వేతనం, గ్రాట్యుటీ చెల్లింపులు లేవని, వీటిని వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని రఘునాథరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్ బాబు, ప్రధానకార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడు దొడ్డ తిరుపతి రెడ్డి మాజీ అధ్యక్షుడు మాలకొండయ్య, మాజీ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కడియాల ప్రసాద్ సంఘ నాయకులు చీకిరి గాలయ్య, మేకల మోహన్ రావు, శివశంకర్, ఖాదర్ భాష, కొండయ్య శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌తో సీడీఎస్ భేటీ

న్యూదిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల వేళ దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి అనంతర భద్రతా చర్యలు, సరిహద్దులో ప్రస్తుత పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం.బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరీ కూడా నార్త్ బ్లాక్‌కు చేరుకున్నారు. సరిహద్దులో పాక్ కవ్వింపుల వేళ ఈ ఉన్నత స్థాయి వరుస భేటీలకు ప్రాధాన్యత ఏర్పడింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. వీటిని జీర్ణించుకోలేని పాక్ నేతలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాక్ సైన్యం.. నియంత్రణ రేఖ వెంట దాడులు చేస్తోంది. వీటిని భారత సైన్యం తిప్పికొడుతోంది. ఈ ఉద్రిక్తతలతో పారామిలటరీ, ఆర్మీ సిబ్బంది సెలవులు రద్ద అయ్యాయి. వెంటనే విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మా ప్రభుత్వానికి ధోకా లేదు: డీకే

బెంగళూరు: ఏదో విధంగా తమ ప్రభుత్వాన్ని కుల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా 2028లో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ నేత ఉద్ఘాటించారు. బీజేపీ, జేడీఎస్ పొత్తును దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికార పీఠాన్ని ఈ పార్టీలు కదల్చలేవన్నారు. 'మా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు ఫలించబోవ'ని అన్నారు. 'మా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. ఆ కూటమిలోకి మరో నాలుగు పార్టీలు చేరినా మా ప్రభుత్వానికి ధోకా ఉండదు. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది' అని డీకే శివకుమార్ దీమాగా చెప్పారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయిన సందర్భంగా నిర్వహించిన సభలో డీకే ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మెచ్చే పరిపాలన అందిస్తున్నామన్నారు. గతంలో మహిళలు, యువత, రైతుల అభివృద్ధి కోసం బీజేపీ, జేడీఎస్ చేసినదేమిటని ప్రశ్నించారు. అందరికీ సమాన హక్కులు, జీవితం కల్పించే ఉద్దేశంతో రూ.4లక్షల కోట్లకుపైగా బడ్జెట్‌ను తమ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టినట్లు చెప్పారు. అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

మతసామరస్యం అవశ్యం

ఉగ్రదాడిని ఖండించిన ఇస్కఫ్

విశాలాంధ్ర-మదనపల్లె: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభ తీవ్రంగా ఖండించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా మతసామరస్యం పాటించాలని పిలుపునిచ్చింది. ఇస్కఫ్ రాష్ట్ర మహాసభలు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆదివారం ముగిశాయి. మదనపల్లి డిక్లరేషన్‌ను సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కాగితాల రాజశేఖర్ ప్రకటించారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్ట్ చర్యలకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) తన నిబద్ధతను నిత్యం కొనసాగిస్తున్నదని వివరించారు. యుద్ధాలు, పర్యావరణ విధ్వంసం, సామాజిక అసమానత, సాంస్కృతిక అసహనం... ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇస్కఫ్ భవిష్యత్‌లో చేపట్టాలని భావిస్తున్న కార్యక్రమాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. అగ్రరాజ్యాల కుట్రలకు గురవుతున్న పలస్తీనా, క్యూబా ప్రజలకు సంఘీభావం ప్రకటించించాలని, భారత దేశంలో మత సామరస్యాన్ని పెంపొందించడం, ప్రపంచ దేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడం ఇస్కఫ్ ఆశయం. ఇస్కఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. టి.ఎస్. సుకుమారన్, ఆచార్య వి. బాలమోహన్ దాస్, బొల్లిముంత కృష్ణ అధ్యక్ష వర్గంగా, కాగితాల రాజశేఖర్ అధ్యక్షునిగా, ఎస్. నరసింహులు, తుంగ శ్రీధర్ రావు ప్రధాన కార్యదర్శులుగా, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎం. మాధవరావు, ప్రచార కార్యదర్శిగా మదనపల్లికి చెందిన డి.వి. శివకుమార్ ఎన్నికయ్యారు.

పీఎస్ఆర్ ఆంజనేయులుకు అస్వస్థత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:ఏపీ ఇంటిలిజెన్సీ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అస్వస్థతకు గురయ్యారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వేధింపుల కేసులో ఆయన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆంజనేయులును ఇటీవల అరెస్టు చేసి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కోర్టు అనుమతితో మూడు రోజులపాటు ఆయనను సీఐడీ అధికారులు విచారణకు తీసుకొచ్చారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులుకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హై బీపీ ఉండటంతో తిరిగి ఆయనను జైలుకు తరలించారు.

ఆర్‌ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్ అంబానీ

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్‌ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్ అంబానీ నియమితులయ్యారు. ఆయన మే 1 నుంచి ఈ పదవిలో ఐదేళ్లు కొనసాగుతారు. ఈ మేరకు కంపెనీ ఒక ప్రకటన చేసింది. వారసత్వ ప్రణాళికలో భాగంగా 2023 ఆగస్టులో ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఈశా, ఆకాశ్, అనంత్‌ను ఆర్‌ఐఎల్ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేర్చారు. ఆకాశ్ 2022 జూన్ నుంచి జియో ఇన్ఫోకామ్ చైర్మన్‌గా ఉన్నారు. ఈశా... రిటైల్, ఇ-కామర్స్, లగ్జరీ వ్యాపారాలు చూస్తున్నారు. కొత్త ఇంధన వ్యాపారాలను అనంత్ చూసుకుంటున్నారు. టెలికాం, రిలయన్స్ డిజిటల్ ప్రోపర్టీస్‌ను నిర్వహిస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్, రిలయన్స్ రిటెయిల్ బోర్డుల్లో అంబానీ పిల్లలున్నారు. ఈనెల 25న జరిగిన ఆర్‌ఐఎల్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మానవ వనరులు, నామినేషన్-రెమ్యునరేషన్ కమిటీ సిఫార్సు మేరకు అనంత్‌ని డైరెక్టర్‌గా తీసుకున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారమిచ్చింది. అనంత్ అంబానీ... బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ చేశారు. రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఈయనే మొదటి నామినేట్ అయ్యారు. 2022 ఆగస్టులో రిలయన్స్ ఎనర్జీ వర్టికల్ నాయకుడిగా అనంత్‌ను నియమించారు. 2020 మార్చి నుంచి జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డులో... 2022 మే నుంచి రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ బోర్డులో ఉన్నారు. 2021 జూన్ నుంచి రిలయన్స్ న్యూ ఎనర్జీ, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ బోర్డుల్లోనూ ఉన్నారు. 2022 సెప్టెంబరు నుంచి రిలయన్స్ ఫౌండేషన్ బోర్డులో అనంత్ అంబానీ కొనసాగుతున్నారు.

నిర్వేదంతో నిష్క్రమణ...

న్యూదిల్లీ: భారతదేశాన్ని సందర్శించే పాకిస్థానీ పౌరుల నిష్క్రమణ గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో పాక్ పౌరులు బంధువులకు వీడ్కోలు పలికారు. అటారీ మీదుగా దేశం దాటారు. ఒక బాలిక తన తల్లి లేకుండా భారతదేశాన్ని విడిచిపెట్టింది. తల్లి భారతీయురాలు కావడంతో ఆమెతో పాటు పాకిస్థాన్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 'నా తల్లి భారతీయురాలు, ఆమె పాకిస్థాన్‌కు మాతో పాటు వెళ్లడానికి అనుమతించబడదు' అని బాలిక సరిత ఆదివారం అటారీ సరిహద్దు వద్ద సుదీర్ఘ క్యూలో నిలబడి అరిచింది. తన సోదరుడు, తండ్రితో పాటు వీసా గడువు ముగియడంతో భారతదేశాన్ని విడిచిపెట్టడానికి తొందరపడుతున్న వందలాది మంది పాకిస్థానీ పౌరులలో సరిత కూడా ఉంది. ఏప్రిల్ 29న జరగాల్సిన పెళ్లికి ఆమె కుటుంబసభ్యులు వచ్చారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత్‌కు వచ్చాం' అని కన్నీటి పర్యంతమైంది. భారతీయ పౌరురాలైన ఆమె తల్లికి వారితో ప్రయాణించడానికి అనుమతి లేదు. 'వారు (అటారీ అధికారులు) మా అమ్మను వెంట వెళ్లనివ్వబోమని చెబుతున్నారు. నా తల్లిదండ్రులు 1991లో పెళ్లి చేసుకున్నారు. భారతీయ పాస్‌పోర్ట్ ఉన్నవారిని అనుమతించబోమని చెబుతున్నారు' అని ఆమె చెప్పింది. ఆదివారం భారతదేశం నుంచి నిష్క్రమించడానికి అటారీ సరిహద్దు పాయింట్ వద్ద వందలాది మంది క్యూలో ఉన్నారు. అయితే పాకిస్థానీ పౌరులకు జారీ చేయబడిన మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు చెల్లుబాటులో ఉంటాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.